ఆదివారం
ప్రజాశక్తి
అక్టోబర్ 19, 2003



ఖండాంతరాలకు విస్తరిస్తున్న
పూల పరిమళం

హ్యాపీ బర్త్‌డే

(19-10-2003నుండి
25-10-2003వరకు)

ఇ. బిందు
3సం॥, 19-10-2000
శశిరేఖ- నర్సింహ్మ
మంచాల- రంగారెడ్డి

ఆకాశ్
1సం॥, 19-10-2002
సుజాత- సోమశేఖర్
శ్రీకాకుళం

డి. ఎస్. వాసుదేవ్
2సం॥, 19-10-2001
లక్ష్మి- స్వామి
హున్సా- నిజామాబాద్

సాయితేజ(బబ్లూ)
3సం॥, 19-10-2000
సునిత- జయచందర్
శంకర్‌పల్లి- రంగారెడ్డి

సందిప్ యాదవ్
6సం॥ 21-10- 1997
పద్మ-మల్లేశం
దోర్నకల్- వరంగల్

కూపరి మనోహర్
2సం॥ 20-10- 2001
లక్ష్మి- మోహన్
ముషీరాబాద్- హైదరాబాద్

నీరటి బాలయోగి
2సం॥ 21-10-2001
భాగ్యలక్ష్మి- అంజయ్య
షాబాద్- రంగారెడ్డి

సి.ఎస్. ముకుంద్
3॥సం, 23-10-2000
హేమమాలిని- సౌందర్ రాజ్
మల్కాజ్‌గిరి- హైదరాబాద్

టి. అశిల్ - మృదుల
8॥సం, అక్టోబర్-1995-5॥సం, అక్టోబర్-1998
సరిత- దామోదర్‌రావు
కాగజ్‌నగర్- ఆదిలాబాద్

సయ్యద్‌ఇల్జా
5॥సం, 24-10-1998
శబాన- లాయక్ పాషా
వేములవాడ- కరీంనగర్

బి. సుచరిత్‌శెట్టి
3॥సం, 25-10-2000
భాగ్యలక్ష్మి- శ్రీనివాస్
త్రిపురాంతకం- ప్రకాశం

సందీప్
1సం॥, అక్టోబర్- 2002
కవిత- గణేష్
విద్యానగర్- నల్లగొండ

కె. ఎస్. తేజస్వి
10సం॥, అక్టోబర్1993
వేణు- సత్యనారాయణ
ఉక్కునగరం- విశాఖపట్నం

దిన్నా
1సం॥, అక్టోబర్- 2002
లక్ష్మి- నర్సిములు
కమేట- రంగారెడ్డి

మనలో మాట

డబ్బింగు సినీమా!

పందిట్లో పెళ్ళవుతున్నది!
కనువిందవుతున్నది!

– ఇది ఒక సినీమా పాట. పాత సినీమా పాట. 'ఆహ్' అనే సినీమాని తెలుగులో 'ప్రేమలేఖలు' అనే పేరుతో డబ్ చేసేరు. అందులోది ఈ పాట! రచయిత ఆరుద్ర!

పరభాష నుంచి మన భాషలో డబ్ చేసే సందర్భంలో – ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా – పెదాల కదలికలో తేడాలొస్తాయి!

"దేవుడున్నాడా లేడా? ఆ సంగతి చెప్పు ముందు" అని అర్థం వచ్చేలా హిందీ మాటని పెదాల కదలికకు లాగా సూటయ్యే విధంగా తెలుగులో చెప్పాలంటే కుదరకపోవచ్చు!

అప్పుడు తెలుగు రచయితకు తాడు తెగుతుంది!

అందువల్ల సంకర భాషతో సరిపెట్టేస్తాడు!

డైలాగుల కంటె పాటల విషయంలో యింకా ఇబ్బంది పడవలసి వస్తుంది! పెదాల కదలికకు అనువైన పదాలు గుప్పించడం రచయితకు గొప్ప కష్టమవుతుంది!

పైగా – మ్యూజిక్ ఒకటి! తాళం తప్పకూడదు!

ఇన్ని జాగ్రత్తలు తీసుకుని పాట రాయాలంటే – పాటల రచయితకు తల తిరిగిపోతుంది!

ఎక్కడో ఏ డబ్బింగు చిత్రానికోగాని పాటలు కుదిరి చావవు. కుదిరినా ఆ పాటలు తెలుగు పాటల్లాగా వుండవు. కనబడే పెదాల కదలికకు – వినపడే పాటకీ సంబంధముండదు. ఏదో పాడుతుంటారు. మరేదో వినిపిస్తూ వుంటుంది!

అల్లాంటిది–

ఆహ్ అనే హిందీ సినీమాకి తెలుగు వర్షన్‌లో పాటలు మహత్తరంగా కుదిరేయి! ఆ ఘనతకి ఆరుద్ర పనితనమే కారణమని స్వాభిప్రాయం!

మహానుభావుడు–

ఆ చిత్రంలో అన్ని పాటలూ పెదాల కదలికకు ఏ మాత్రం తేడా లేకుండా అద్భుతమైన సాహిత్యాన్ని వినిపించేడు. హిందీ సంగీతానికి అనుగుణంగా తెలుగు అక్షరాలు అందించేడు!

'చీకటి దారి చుట్టూ ఎడారి' అనే పాటలో గానీ 'విధి రాకాసి కత్తులు దూసి' అనే పాటలో గానీ కల్తీ లేని తెలుగు పదాలే అందంగా వినిపిస్తాయి! తియ్యటి తెలుగు పాటలుగా అనిపిస్తాయి!

ఆ సినీమాలో అన్ని పాటలూ అంతే! ఆణిముత్యాలు! డబ్బింగ్ టైపులో వుండనే వుండవు!

పందిట్లో పెళ్ళవుతున్నాది అనే పాట నాకు చాలా యిష్టం. ఆ పాట వెలుగులోకి వచ్చి అర్థ శతాబ్దం దాటింది కాబోలు! ఆ పాట ఇప్పుడు వింటున్నా మధురం గానే వుంటుంది!

ఇప్పుడు పెళ్ళి పందిళ్ళ తతంగానికి తెరపడిపోయింది! వాటి స్థానంలో ఫంక్షను హాళ్ళూ, గార్డెన్లూ వెలిసేయి. ఆరుద్రనే పట్టుకొచ్చి 'పందిట్లో పెళ్ళవుతున్నాది' అని రాయమంటే 'ఫంక్షన్ హాల్లో పెళ్ళవుతున్నాది' అని రాస్తాడేమో! వదిలేయండి!

డబ్బింగనే విద్య గురించి ఇంత వివరంగా చెప్పడానికి బలమైన కారణమే వుంది! చిన్న నాయకులు పెదాలు కదుపుతారు! ప్రభువులు మాటాడుతుంటారు!

చిన్ననాయకులకు మాటలు రావని ప్రభువులకు తెలుసు! అంచేత మాటాడే పని వాళ్ళది! పెదాలు కదిపే కష్టం చిన్న నాయకులది!

రాష్ట్రం, దేశంలోనే కాదు – ప్రపంచంలో నడుస్తున్న కథ కూడా ఇదే!

డబ్బింగు సినీమా! ●

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం . . . 2
కవర్ స్టోరీ . . . 5
జీవనశైలి . . . 8
గేయలహరి . . . 9
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
కచేరి . . . 14
ఇంతిసంగతులు . . . 15
టూరిస్టుగైడ్ . . . 16
క్రీడారంగం . . . 17
పుస్తక పరిచయం . . . 20
కళాసాహితి . . . 21
పలుకుబడి . . . 24

ఇంకా...



రేయిస్ సిండ్రోమ్‌కు ప్రత్యేక చికిత్స లేదు ఆరోగ్యం ... 4



పిల్లలను ఆడంబరాలకు దూరంగా వుంచాలి
బాలవికాసం . . . 10

గురిజ గింజలు
కథ . . . 18, 19

అనంతలో కొనసాగుతున్న మూఢాచారం
రియల్ స్టోరీ . . . 22, 23

కార్టూన్ కదంబం





ఇక అంతా మంచినీళ్ళప్రాయమే!

ఇంటర్‌వ్యూకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఇ-మెయిల్ పంపాలంటే ఇంగ్లీష్!
కంప్యూటర్ నేర్చుకోవాలంటే ఇంగ్లీష్!
కాంపిటెటివ్ ఎక్జామ్స్ వ్రాయాలంటే ఇంగ్లీష్!
విదేశాలకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఎక్కడ చూసినా ఇంగ్లీష్.. ఇంగ్లీష్.. ఇంగ్లీష్..

"నేను ఎన్నో విధాల ప్రయత్నించి చూసాను. కాని నేను మాత్రం ఇంగ్లీషులో సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను. ఏదైనా తప్పుగా మాట్లాడేస్తానేమో అని భయంగా వున్నది".

ఇదేనా మీ ప్రాబ్లమ్...? NO PROBLEM !

మీచేత సరళంగా ఇంగ్లీషులో మాట్లాడించటానికి సులభమైన ఫార్ములా కనిపెట్టాం. అవును, **'స్పీచ్ జనరేటింగు ఫార్ములా' SGF™** పద్ధతిలో మేము తయారుచేసిన **స్పోకన్** ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్ పాఠాలను రోజూ అరగంట చదివి ప్రాక్టీసు చేస్తే చాలు.

వ్యాకరణ దోషం లేకుండా వాక్యాలను రూపొందించి వ్రాయటం నేర్చుకొని ఇంగ్లీషులో తడబడకుండా సరళంగా మాట్లాడటానికి మీవల్ల అవుతుంది. ఇప్పటికే **15** లక్షల మంది ఈ శిక్షణ ద్వారా ఫలితం పొందారు.

ఇంకా ఏంటి ఆలోచిస్తున్నారు?

వెంటనే క్రింద వున్న కూపను పూర్తిచేసి పంపండి. కోర్సు పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్ వద్ద **రూ.395/-** చెల్లించి పాఠాలను తీసుకోండి.

ప్రతిరోజూ అరగంట పాఠాలు చదివి ప్రాక్టీసు చెయ్యండి, ఇంగ్లీషులో గడగడమని మాట్లాడండి.

ఇదిగో కూపన్

Yes, నేను అరగంట సమయం కేటాయించి ఇంగ్లీషు నేర్చుకోవాలని ఆశిస్తున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా వెంటనే పంపండి. పోస్టుమేన్ వద్ద **రూ.395/-** చెల్లించి తీసుకుంటాను.

పేరు: ....

చిరునామా: ....

....

....PIN.....................

పాఠాలతో పాటు 416 పేజీల ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీ ఉచితంగా పొందండి.

VIVEKANANDA INSTITUTE

9 (T), Madley Road, T.Nagar, Chennai - 600 017.

PSKT

వివేకానంద ఇన్‌స్టిట్యూట్
స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్

ఇక ఇంగ్లీష్
మంచినీళ్ళప్రాయమే!

10/TEL/03/NAGA

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (•S.R.NAGAR ☎ 23714330. •MEHDIPATNAM ☎ 55755888. •DILSUKH NAGAR ☎ 24044352. •KUKATPALLY ☎ 55341431. •RAMACHANDRA PURAM. •VANASTHALI PURAM ☎ 24122464. • A.S.RAO NAGAR). •NELLORE ☎ 2327702. •THIRUPATI ☎ 2252878. •ANANTAPUR ☎ 241029. •KAKINADA ☎ 2386638. •VIJAYAWADA ☎ 5530053. •GUNTUR ☎ 2238541. •VISAKHAPATNAM ☎ 2738892. •KURNOOL. •RAJAHMUNDRY ☎ 2422003. •NIZAMABAD ☎ 235767. •CUDDAPAH ☎ 224445. •KARIMNAGAR ☎ 2234883. •WARANGAL ☎ 2578946. •MIRYALGUDA ☎ 230130.

రేయిస్ సిండ్రోమ్‌కు ప్రత్యేక చికిత్స లేదు



రాయవెల్లూర్‌లోని క్రిష్టియన్ మెడికల్ కాలేజీకి చెందిన ప్రముఖ వైరాలజిస్ట్ డాక్టర్ జాకబ్‌జాన్ ఇటీవల రాష్ట్రంలో వ్యాధిగ్రస్థులు బయట పడుతున్న జిల్లాలను పర్యటించారు. ఆయన వ్యాధిగ్రస్థ శిశువులను పరీక్షించి వ్యాధి రేయిస్ సిండ్రోమ్ అయివుండవచ్చునని అభిప్రాయపడ్డారు. అయితే అది రేయిస్ సిండ్రోమ్ అని కచ్చితంగా చెప్పలేని పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఏది ఏమైనా 'రేయిన్ సిండ్రోమ్' ఒకటి ఉందనే విషయం ప్రజలకు తెలిసింది.

రేయిన్ సిండ్రోమ్‌ను అనే ఈ వ్యాధి లక్షణాలను తొలిసారిగా గుర్తించిన ఘనత మన దేశానికే దక్కుతుంది. 1956లో డా॥ నాజిబ్‌ఖాన్ అనే వైద్య నిపుణుడు జెంషెడ్‌పూర్‌లో ఈ సిండ్రోమ్‌ను గుర్తించారు. అందుకనే ఈ వ్యాధిని 'జెంషెడ్‌పూర్ ఫీవర్' అని కూడా పిలుస్తారు. వ్యాధి లక్షణాలను వెలుగులోకి తెచ్చిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధిపై పరిశోధనలు ప్రారంభమయ్యాయి. 1964వ సంవత్సరంలో ఆస్ట్రేలియాకు చెందిన డా॥ రేయిస్, అతని సహచరులు వ్యాధిపై సమగ్ర నివేదికను రూపొందించారు. వారు ముఖ్యంగా శరీరంలో వ్యాధికి గురవుతున్న వివిధ అవయవాల తీరును పరిశోధించారు. అంటే శాస్త్రీయ పరిభాషలో పాంథోజెనిసిస్‌ను కనుగొన్నారు. వ్యాధి నిర్ధారణ రంగంలో ఇదొక ప్రధానాంశం అయింది. ఆ వైద్య నిపుణుని పేరునే వ్యాధి లక్షణాలను బట్టి రేయిస్ సిండ్రోమ్ అని పేరు పెట్టారు.. (సిండ్రోమ్ అంటే వ్యాధి లక్షణాల సముదాయం) రేయిస్ సిండ్రోమ్‌లలో అనేక వ్యాధి లక్షణాలు బయటపడతాయి.

సిండ్రోమ్ కారక సూక్ష్మ జీవులు ఏమిటి ?

వైద్యశాస్త్రవేత్తలు ఇప్పటికీ రేయిన్ సిండ్రోమ్‌కు ఏ సూక్ష్మజీవులు కారణమవుతున్నాయన్న విషయాన్ని కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. అయితే వ్యాధికి కారణం 'వైరస్'లు అని అందరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వారిసెల్లా ఇన్‌ఫ్లూయంజా వంటి వైరస్‌లు, వాటిలో చోటు చేసుకుంటున్న ఉత్పరివర్తనలు (మ్యుటేషన్స్) రేయిస్ సిండ్రోమ్‌కు కారణమని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ వైరస్‌లు ఎలా వ్యాప్తి చెందుతాయి ?

వైరస్ కలిగిన వ్యక్తులు తుమ్మడం, దగ్గడం ద్వారా వ్యాధి ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. పిల్లలు ముఖ్యంగా 3 నెలల నుండి 15 సంవత్సరాల మధ్య వయస్కులు ఎక్కువగా వ్యాధికి గురవుతున్నారని గతంలోని నివేదికలు తిరగేస్తే తెలుస్తోంది. వ్యాధి లక్షణాలు చాలా త్వరగా బయటపడుతుంటాయి.

వైరస్ కారణంగా శరీర అవయవాలలో ఏం జరుగుతుంది ? లక్షణాలు ఎలా ఉంటాయి ?

వైరస్ సోకిన వారిలో కాలేయంలో అసాధారణ మార్పులు కనబడుతున్నాయి. లివర్‌లో ఫాటీ ఇన్‌పిల్ ట్రేషన్ వుంటోంది. తక్కువ సమయంలో లివర్ పనితీరులో మార్పు వస్తోంది. దీనినే హెపాటిక్ ఫెయిల్యూర్‌గా పేర్కొంటారు. మూత్రపిండాలు కూడా ఎఫెక్ట్ అవుతాయి. లివర్ సరిగా పని చేయనందువల్ల, కిడ్నీలలో కూడా మార్పులు రావడం వల్ల రక్తంలోని టాక్సిక్ పదార్థాలు విసర్జితం కావు. ఫలితంగా అవి రక్తంలో పేరుకుపోతాయి. ఈ టాక్సిక్ పదార్థాలు మెదడును చేరి 'ఎన్‌సెఫలోపతి'కి దారితీస్తాయి. మెదడులో నీరు చేరుతుంది. దీనినే 'సెరెబ్రల్ ఎడిమా' అంటారు. వ్యాధి ప్రారంభ దశను ప్రోడ్రోమల్ స్టేజ్ అంటారు. ఈ దశలు త్వరితగతిన మారుతూ చివరికి రోగిని కోమాదశకు, తర్వాత మరణదశకు చేరుస్తాయి. జ్వరం, వాంతులు మొదలవుతాయి. ఆకలి ఉండదు. మెనింజైటిస్ లేదా ఎన్‌సెఫలైటిస్ లక్షణాలు ఉంటాయి. ఫిట్స్ కూడా రావచ్చును. క్రమంగా మానసిక స్థితిలో మార్పులు వస్తాయి. స్పృహ కోల్పోతారు. కోమాలోకి వెళతారు. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. మరణం సంభవిస్తుంది. ఇదంతా 24 నుండి 72 గంటలలో జరిగిపోతుంది. లభిస్తున్న వివరాల ప్రకారం రేయిస్ సిండ్రోమ్‌లో మరణాలు 25-70 శాతం వరకు ఉంటాయి. వ్యాధి లక్షణాలను అయితే గుర్తించగలిగారు. కాని నిర్ధారణకు ప్రత్యేక పరీక్షలు ఏమీ రూపొందించలేకపోయారు. కచ్చితంగా ఇది రేయిస్ సిండ్రోమ్ అని తేల్చి చెప్పే పరీక్షలు ఏమీ లేవు. సాధారణ పరీక్షలలోని అసాధారణత ఆధారంగా వ్యాధిని నిర్ధారించలేము. ఎందువలనంటే అనేక వ్యాధులలో ఒకే విధమైన అసాధారణతలు ఉంటాయి. వ్యాధికి గురైన వారి నుండి వెన్నుపాములోని నీరు (సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్) తీసి పరీక్షిస్తే... అందులో షుగర్ శాతం తక్కువగా ఉంటుంది. రక్తంలో అమ్మోనియా శాతం పెరిగిపోయి ఉంటుంది. రక్తం గడ్డకట్టే సమయం కూడా పెరుగుతుంది. రక్తంలోని ప్రొటీన్స్ తగ్గిపోతాయి. ఈ పరీక్షల ఫలితాలు చాలా వ్యాధులలో అలానే ఉంటాయి. కనుక ఇంతకు ముందే చెప్పినట్టుగా ఈ పరీక్షల ఆధారంగా అది రేయిస్ సిండ్రోమ్ అని చెప్పలేము.

వ్యాధికి చికిత్స ఉందా ?

రేయిస్ సిండ్రోమ్‌కు ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదు. బయట పడుతున్న లక్షణాల ఆధారంగా సింప్టమాటిక్ చికిత్స చేయడం తప్ప చేయగలిగింది ఏమీ లేదు. ●

ఆరోగ్య సలహాల కోసం ప్రశ్నలు పంపేటప్పుడు మీ వయస్సు, జబ్బుకు సంబంధించిన పూర్తి వివరాలు, మీ పూర్తి అడ్రస్ రాయండి.

చిరునామా :

సంపాదకులు, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

* భువన, బోరెడ్డి అయోధ్యరెడ్డి

పూల పరిమళానికి స్పందించని హృదయం ఉండదు. పుష్పాలను వర్ణించని కవిలేదు. రణరంగపుటెత్తులతో.. రాచరికపు హంగులతో తీరిక లేనివారైనా పువ్వు పరిమళాన్ని ఆస్వాదించని వారుండరు. శుభకార్యమేదైనా పూలు లేకుండా ప్రారంభం కాదు. అశుభకార్యం కూడా పూలు లేనిదే ముగియదు. ఆ మాటకొస్తే మనిషి పుట్టుక నుంచి చావు వరకు జరిగే అన్ని కార్యక్రమాల్లోనూ పూలకెంతో ప్రాధాన్యత ఉంది. సినిమా కథనుంచి నిజజీవితం వరకు పూల ప్రస్తావన లేకుండా అంతం కాదు. 'పుష్పవిలాపం' గురించి చదివిన మనకు వాటిని పండిస్తున్న కర్షకుని ఆవేదనను తెలుసుకోవడానికి ఆసక్తి కలుగక పోవచ్చు. 'పనికిరానివాడి కంఠాన్ని అలంకరించడం కంటే దేశభక్తుని పాదాలకింద నలగాలని' దాశరథిగారి 'పూలు' పరితపిస్తోంటే.. పంచభక్ష్యపరమాన్నాలకంటే తన కుటుంబసభ్యుల ఐదువేళ్లు నోట్లోకి మూడుపూటలా పోతే చాలని వాటిని పండించే చేతులు ఆరాటపడుతున్నాయి. ప్రపంచీకరణ ప్రభావంతో వ్యవసాయరంగం కార్పొరేట్ పరిశ్రమగా పరిణామం చెందుతోంది.

ఖండాంతరాలకు విస్తరిస్తున్న

పూల పరిమళం

పూర్వం దేవాలయాల్లో అర్చన, వివిధ శుభ, అశుభ కార్యాలకు, మహిళల అలంకరణ కోసం మాత్రమే పూల సాగు చేసేవారు. కాలం మారింది. ప్రపంచమంతా ఒకటవుతోంది. జీవన విధానాలు మారుతున్నాయి. సాగుపద్ధతులు మారుతున్నాయి. పూలగుత్తుల స్వాగతాలు, సత్కారాలు పెరుగుతున్నాయి. దాంతో పాటే మన పూల పరిమళాలు ఖండాంతరాలకు వ్యాపిస్తున్నాయి. సాంప్రదాయబద్ధంగా సాగే పూలసాగు నేడు కార్పొరేట్ వ్యవసాయంగా రూపుదిద్దుకుంది.

1991లో ప్రారంభమైన సరళీకరణ ఆర్థిక విధానాల పుణ్యాన వ్యవసాయరంగం సంక్షోభంలో పడింది. అయితే పూలను ఎగుమతిచేసే వారు, దిగుమతి చేసుకున్న సూపర్ టెక్నాలజీతో ఏ కాలంలో అయినా వాటిని ఉత్పత్తి చేయగలుగుతున్నారు. ఎగుమతి కోసం ప్రత్యేకంగా 'కట్' పూలను కూడా ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో 185 వేల ఎకరాల్లో ఏటా 4.6 లక్షల టన్నుల పూలు ఉత్పత్తి అవుతున్నాయి. గత ఏడాది 70 కోట్ల విదేశీమారకద్రవ్యం పూల ఎగుమతులు ద్వారా లభించింది. ఇటీవలి కాలంలో మహారాష్ట్ర సహా నాలుగు దక్షిణాది రాష్ట్రాలు పూలసాగులో ముందడుగు వేస్తున్నాయి. ప్రధానంగా పశ్చిమ కనుమలు పూల సాగుకు చాలా అనువుగా ఉండటంతో మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలు పూలసాగును ప్రోత్సహిస్తున్నాయి. ఎడారి రాష్ట్రమైన రాజస్థాన్ సహా ఉత్తరాది శీతల రాష్ట్రాలైన కాశ్మీర్, హర్యానా, హిమాచల్ కూడా పూల సాగును భారీఎత్తున చేపట్టాయి. ప్రత్యేకించి కర్నాటక ప్రభుత్వం కనబరుస్తున్న శ్రద్ధవల్ల ఆ రాష్ట్రం పూల ఎగుమతిలో కూడా ముందున్నది. దేశం నుండి ఎగుమతయ్యే పూలలో 60 శాతం కర్నాటక నుండే జరుగుతుండంతో కేంద్ర వ్యవసాయ, ఆహార ఉత్పతుల ఎగుమతుల సంస్థ బెంగుళూరులో అంతర్జాతీయ పూలవేలం కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించింది. దీని నిర్మాణం కూడా వేగంగా సాగుతోంది. అయితే అన్ని రాష్ట్రాల్లోనూ భారీ ఎత్తున పూలసాగు చేపట్టిన ఎగువ మధ్య తరగతి రైతులు, కార్పొరేట్ సంస్థల అధిపతులు బాగు పడుతున్నారు. ప్రభుత్వాలు ప్రకటించే సబ్సిడీలు, పరికరాలు, రాయితీలు అన్నీ వీరే తన్నుకుపోతున్నారు. సాంప్రదాయక పద్ధతుల్లో సేద్యం చేసే చిన్నరైతులు మాత్రం పూల పరిమళం ఆస్వాదించలేకపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌కు వివిధ దేశాలనుండి ఇటీవలి కాలంలో సందర్శకుల తాకిడి ఎక్కువ కావడంతో రాజధాని

ఎంత శ్రమించినా కూటికి కరువే

పూదోటల సాగులో శ్రమంతా మహిళలదే అయినా తక్కువ ఆదాయాన్ని పొందుతున్నారు. మొక్కలను నాటడం మొదలుకొని పూలను మార్కెట్‌లో అమ్మడం వరకు వారే ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. పూల తోటలను వేసే రైతు ఇంటిలోని మహిళలంతా కష్టపడితేనే వారికి ఆదాయం కనిపిస్తోంది. మొక్కలను నాటడం, అవి పెరిగే దశలో ఎరువులను వేయడం, కలుపు మొక్కలను తీసేయడం, పూలను తెంపడం, అవి మార్కెట్‌లో విక్రయించడం ఇవన్నీ ఆ గ్రామ మహిళలు చేస్తున్న పనులు. గ్రామంలో పూల పెంపకం మొదలైన తొలిదశలో వాటికి సరైన మార్కెట్ దొరకకపోవడంతో రైతులు పూలను ఎక్కడో ఊరవతల పారేశారు. ఆ దశలో పూలను అక్కున చేర్చుకొని ఊరూరా తిరిగి వాటిని విక్రయించి రైతులను ఆదుకున్నది మహిళలే. ఇంత చేస్తున్నా మహిళల శ్రమకు గుర్తింపు లభించడంలేదు. కిలో కనకాంబరం పూలను తెంపితే వారికి ఇచ్చేది 15 రూపాయలు మాత్రమే. ఒక్కొక్క సారి రోజంతా తెంపినా కిలో పూలు రావు. కనకాంబరం పువ్వు బరువు తక్కువగా ఉంటుంది. దీంతో కిలో పూలు తెంపాలంటే చాలా ఎక్కువ సమయాన్ని తీసుకుంటోంది. చామంతి పూల తెంపకంలో రోజు కూలీ కింద 25 నుండి 35 రూపాయలు ఇస్తున్నారు. తెంపిన పూలను మహిళలే గంపల్లో వేసుకొని ఊరూరా తిరిగి విక్రయిస్తున్నారు. రైతు వద్ద కిలో పూలను 60 నుండి 80 రూపాయల వరకు కొని బయట విక్రయించగా వారి ఛార్జీలు పోను మహిళలకు రోజుకూలీ కింద 30 నుండి 40 రూపాయలు మిగులుతున్నాయి. పూల పెంపకం ఎంతోకొంత లాభదాయకంగా ఉన్నా మహిళల శ్రమకు తగ్గ ఫలితం రావడంలేదన్నది వాస్తవం. కేవలం వ్యవసాయేతర కుటుంబాల మహిళలే కాకుండా పూలను పండించిన చిన్న, సన్నకారు రైతుల కుటుంబంలోని మహిళలు కూడా బయటకు వచ్చి పూలను విక్రయిస్తున్నారు.

సాంప్రదాయ పంటలను వేసినప్పుడు గ్రామంలో కొంత మందికి మాత్రమే పని లభించేది. గ్రామంలో అధిక శాతం రైతులు పూలపెంపకాన్ని మొదలుపెట్టిన తరువాత మహిళలకు కూడా పని పెరిగింది. పూల పెంపకంతో గ్రామాన్ని నందనవనంగా తీర్చిదిద్దడంలో మహిళలు ప్రముఖపాత్ర వహిస్తున్నా వారి శ్రమకు తగిన ఫలితం లభించడం లేదు.

చుట్టుపక్కల జిల్లాల్లో పూలసాగు పెరిగింది. ఆహారధాన్యాల పంటలకు ధరలు రాక సతమతమవుతున్న బక్క రైతులు, అలాగే ఎంతైనా పెట్టుబడి పెట్టగల, ప్రభుత్వ రాయితీలు పొందగల పెద్దరైతులు కూడా దీనిపట్ల మొగ్గు చూపుతున్నారు.

మెదక్, రంగారెడ్డి జిల్లాలలోని రైతులు అనేకమంది పూలతోటలను సాగు చేస్తున్నారు. మెదక్ జిల్లా కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామ రైతులు సాంప్రదాయ పంటలకు బదులుగా 1981లో వాణిజ్యపంటల వైపు మొగ్గుచూపారు. ఆ గ్రామానికి అప్పట్లో సర్పంచుగా ఉన్న బుచ్చిరెడ్డి ముందుగా కనకాంబరాలను సాగు చేశారు. సాంప్రదాయపంటల సాగుకు నీటి వినియోగం, శ్రమ, పెట్టుబడి ఎక్కువే అవుతున్నా ఆదాయం తక్కువగా ఉందనే కారణంతో వాణిజ్యపంటలవైపు దృష్టిని సారించారు. గ్రామంలో ముందుగా కనకాంబరాలను సాగుచేసిన బుచ్చిరెడ్డిని గ్రామస్తులు ఎగతాళి చేశారు. ఇది ఆయనలో మరింత పట్టుదలను పెంచింది. ఎట్టకేలకు ఆయన కనకాంబర పూలను పండించారు. పండించిన పూలకు మొదట్లో కొంతకాలం మార్కెట్‌లో చుక్కెదురైంది. పండించిన పూలను సమీపంలోని జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి, రాష్ట్ర రాజధాని హైద్రాబాద్, జోగిపేట, కామారెడ్డి, నిజామాబాద్ తదితర పట్టణాలకు తీసుకెళ్లి అమ్మడానికి తీవ్ర ఇబ్బందులనెదుర్కొన్నారు. స్థానిక పూలకు మార్కెట్‌లో నిరాదరణ ఎదురైంది. అరకొర బస్సు సౌకర్యం వల్ల పూలను రవాణా చేయడం వ్యయ, ప్రయాసలకు గురిచేసింది. గ్రామీణ ప్రాంతాల్లో పూలను కొని వినియోగించడం అరుదు కావడంతో తప్పనిసరిగా ఏదో ఒక పట్టణానికి ఎగుమతి చేయాల్సి వచ్చింది. అన్ని ఇబ్బందులనూ ఎదుర్కొని ఆయన పూలను పండించారు. ఇలా రెండు మూడేళ్లు గడిచేసరికి గ్రామాల్లో తిరిగి పూలవ్యాపారులే తోటవద్ద కొనుగోలు చేయడానికి అలవాటు పడ్డారు. తోటల వద్ద కొనడం వల్ల చిరు వ్యాపారులకు తాజా పూలు దొరకడంతో పాటు, రవాణా ఛార్జీలు కూడా కలిసొచ్చాయి. దీంతో గ్రామంలోని మధ్యతరగతి రైతులు కూడా క్రమంగా పూలతోటల వైపు మొగ్గు చూపారు. ఐదొందల కుటుంబాలున్న మునిదేవునిపల్లిలో సుమారు 60 మంది రైతులు 260 ఎకరాల్లో వివిధ రకాల పూలతోటలను సాగుచేస్తున్నారు. కనకాంబరం, చామంతి, గులాబీ, కాగడ, బంతి పూలతోటలను గ్రామస్తులు సాగుచేస్తున్నారు. గ్రామంలో రైతులు పూలను అమ్ముకోవడానికి తోటల వద్దకు వచ్చిన వ్యాపారులపైనే ఆధారపడుతున్నారు. ఈ తోటల సాగు వల్ల ఎగువ మధ్యతరగతి రైతులు ఆర్థికంగా బలపడినప్పటికీ సన్న, చిన్నకారు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఒకసారి పెట్టుబడి పెట్టి సాగు చేస్తే మూడు నుండి ఏడేండ్ల వరకు ఆదాయం లభిస్తుండటం వల్ల ఆర్థికపరిస్థితి ఎంతో మెరుగు పడిందని ఎగువ మధ్యతరగతి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటల వారీగా పూలతోటల సాగుకయ్యే పెట్టుబడి తక్కువేమీ ఉండదు.

గులాబి : పూలకు రారాణి అయిన గులాబీ సాగు చేయడానికి ఏడాదికి 40 నుండి 60 వేల వరకు అవుతోంది. మేలురకం హైబ్రిడ్ వంగడాలకు ప్రధానంగా



ఎక్కువ పెట్టుబడి అవుతోంది. పూల పంటలో పరిశోధనలు రాష్ట్రంలో ఎక్కువగా లేకపోవడంతో మేలురకం జాతిగులాబీ మొక్కలను కొనడానికి బెంగుళూరును ఆశ్రయించాల్సి వస్తోంది. ఒక్కొక్క గులాబీ మొక్కకు 15 నుండి 18 రూపాయలు ధర ఉంది. దగ్గరలో ఉన్న ట్రాన్స్‌పోర్ట్‌కు బెంగుళూరులోని నర్సరీలు మొక్కలను ఈ ధరకు సరఫరా చేస్తున్నాయి. మొక్కలను నాటేందుకు గుంతలను తీయడం, మొక్కలను నాటడం, నీరు పెట్టడం, కలుపు తీయడం వంటి వాటికి కూలీలకు ఏడాదంతా పని ఉంటుంది. అరెకరం భూమిలో ఎనిమిదొందల గులాబీ మొక్కలు అవసరమౌతాయి. కేవలం అరెకరం భూమిలో పెట్టడానికి మొక్కలకే 12వేలు ఖర్చవుతాయి. పూలు పూసేదశవరకు సేంద్రీయ, రసాయనిక ఎరువులకు ఎనిమిదివేల వరకు ఖర్చవుతాయి. గడ్డితీయడం, క్రిమిసంహారక మందులు, పూలను తెంపడం(కోయడం) వంటి వాటికి మరో పదివేల వరకు ఖర్చు అవుతాయి. ప్రాథమికంగా మొదటి మూడు నెలల కాలంలో పూలు చేతికందేవరకు సుమారు 30 నుండి 40 వేల వరకు అవుతుంది. ఈ పెట్టుబడిని కేవలం ఎగువ మధ్యతరగతి రైతులు మాత్రమే భరించగలరు. వరి, మొక్కజొన్న వంటి సాంప్రదాయక పంటలకు నాలుగు నుండి పదివేల రూపాయలు ఒక ఎకరం భూమిని సాగుకు సరిపోతుంది. ఇదే గులాబీ తోటను అరెకరంలో సాగు చేయడానికి 30 నుండి 40 వేల వరకు అవసరమవుతుంది. అరెకరం భూమిలో రోజు 100 నుండి 200 పూల వరకు ఉత్పత్తి అవుతాయి. స్థానికంగా కొనుక్కుంటున్న పూల వ్యాపారులు రూపాయికొక పువ్వును కొంటున్నారు. మొదటి ఏడాది 24 నుండి 36 వేల ఆదాయం రైతులకు లభిస్తోంది. రెండు, మూడో ఏడాది 30 నుండి 50 వేల వరకు ఆదాయం లభిస్తోంది.

చామంతి : గులాబీ కంటే చామంతిని సాగు చేయడానికి తక్కువ పెట్టుబడి సరిపోతుంది. గులాబీ పూలకు మార్కెట్‌లో అన్నివేళల్లోనూ డిమాండ్



ఉంటోంది. ఈ పూలకు మార్కెట్‌లో ధర తక్కువగా ఉంటోంది. ఈ పూలు చలికాలంలో మూడు నుండి నాలుగు నెలలు మాత్రమే పూస్తాయి. దీపావళి, కార్తీక పౌర్ణమి, నోములు ఎక్కువగా ఉండే అక్టోబరు, నవంబరు నెలల్లో మాత్రమే కొంత ధర ఉంటోంది. డిమాండ్ ఉన్నపుడు 80 రూపాయలు కిలో ఉంటుండగా ఒకొక్కసారి కిలోకు 10 రూపాయలు కూడా దొరకని స్థితి ఏర్పడుతోంది. ఒక ఎకరం చామంతిని సాగు చేస్తే 10 వేల వరకు పెట్టుబడి అవుతుండగా 30 వేల వరకు ఆదాయం లభిస్తోంది.

కనకాంబరం : కనకాంబరం తోట సాగు చేయడానికి ఎకరాకు 20 నుండి 35 వేల వరకు పెట్టుబడి అవసరమౌతోంది. ఈ తోట ఒకసారి సాగు చేస్తే మూడు నుండి ఐదేళ్ల వరకు పూలను అందిస్తోంది. వానాకాలంలో క్రిమిసంహారక మందులు ఎక్కువగా అవసరమై పెట్టుబడి కూడా పెరిగే అవకాశముంది. ఏడాదికి 40 నుండి 80 వేల వరకు ఆదాయం లభిస్తోంది.

బంతి : పూలన్నింటికంటే అతి తక్కువ పెట్టుబడి బంతి పూలను సాగు చేయడానికి అవుతోంది. వీటిని నారుపోసి కొంచెం సారం ఉన్న నేలలో నాటేస్తే సరిపోతుంది. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల అవసరం కూడా ఎక్కువగా ఉండదు. కాకుంటే ధర మాత్రం తక్కువగా ఉంటుంది. ఉత్పత్తి ఎక్కువగా ఉండటం, పెట్టుబడి తక్కువగా ఉండటం వల్ల రైతాంగానికి బంతి తోటను సాగు చేయడం లాభదాయకంగానే ఉంటోంది. రెండు నుండి ఐదు వేల వరకు ఎకరం సాగు చేయడానికి ఖర్చు అవుతుండగా 10 నుండి 40 వేల వరకు ఆదాయం లభిస్తోంది. ఈ పంటను సన్న, చిన్నకారు రైతులే ఎక్కువగా సాగు చేస్తున్నారు.

కాగడ పూలు : కాగడ మొక్కలు నాటడానికి ప్రత్యేకంగా గింజలుండవు. శాఖీయోత్పత్తి ద్వారానే కాగడ పూలను సాగు చేస్తున్నారు. కాగడ పూలను సాగు చేయడానికి అరెకరం భూమికి 30 వేల వరకు పెట్టుబడి అవసరమౌతుండగా 60 నుండి 80 వేల వరకు ఆదాయం లభిస్తోంది. వీటి శాఖీయోత్పత్తి తమ పొలంలోనే చేసుకోవచ్చు. ఉత్పత్తికి ఎక్కువకాలం అవసరం కావడంతో కాగడ పూలను కూడా ఎగువ మధ్యతరగతి రైతులే సాగు చేస్తున్నారు.

ఎక్కువ ఆదాయం వచ్చే గులాబీ, కనకాంబరం, కాగడ పూలకు పెట్టుబడి అవసరమౌతోంది. ప్రభుత్వ పరంగా లభించే సబ్సిడీలు సన్న, చిన్నకారు రైతులకు అందిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే అవన్నీ పెద్దరైతులే తన్నుకుపోతున్నారు. భూగర్భజలాలు తీవ్రంగా అడుగంటిపోయి నీటికొరత పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ నీటి వినియోగంతో పండించే పూలపంటలకు ప్రోత్సాహం కరువైంది. సూక్ష్మనీటి ప్రణాళికకు రాష్ట్ర ప్రభుత్వం 12 వందల కోట్లు కేటాయించిందనే విషయంగానీ, డ్రిప్(బిందు), స్ప్రింక్లర్లు(తుంపర) సేద్యానికి రాష్ట్ర ప్రభుత్వం విశేషప్రాధాన్యాన్నిస్తోందనే విషయం చిన్న రైతులెవరికీ తెలియదు. ఎగువ మధ్యతరగతి రైతులే పూలతోటల పెంపకం ద్వారా ఆర్థిక మెరుగుదలను సాధించారు. ●



రాష్ట్రాల వారీగా పూల ఉత్పత్తి

రాష్ట్రం	విస్తీర్ణం (హెక్టార్లలో)				ఉత్పత్తి మెట్రిక్ టన్నులలో			
	1996-97	1997-98	1998-99	1999-00	1996-97	1997-98	1998-99	1999-00
ఆంధ్రప్రదేశ్	7616	8420	8357	18087	22848	32900	32000	126609
ఢిల్లీ	1866	1866	3450	3450	10274	10274	21007	21007
హర్యానా	1850	1950	2250	2250	31120	33040	40500	40500
హిమాచల్ ప్రదేశ్	100	114	133.3	133.3	406	549	976	976
జమ్మూ & కాశ్మీర్	133	167	75	42	1	16	46	7
కర్నాటక	19658	20780	20780	20801	115600	124290	124290	124440
మధ్యప్రదేశ్	1334	1334	1956	1387	13127	13127	1170	832
మహారాష్ట్ర	5439	4786	4979	6600	60012	33250	38582	28336
ఒరిస్సా	–	–	175	175	–	–	868.5	868.5
తమిళనాడు	15856	16745	18120	18120	87208	92097	133125	142250
ఉత్తర ప్రదేశ్	160	160	160	160	–	–	–	–

* అంపశయ్య నవీన్

నువ్వెంతిస్తే అంతమాత్రమే తీసుకుంట...

"ఈ మధ్య సినిమాలేమన్నా చూశావా? నువ్వు గొప్ప సినిమా ప్రియునివి కదా"

"మొన్ననే ఓ సినిమా చూశాను గురూ! ఏం సినిమా అనుకుంటున్నావది... థియేటరంతా అదిరిపోయిందనుకో... అంత గొప్ప సినిమా... నభూతో నభవిష్యతి అనుకో..."

"ఆ సినిమాలో అంత విశేషమేమిటో?"

"ఆ సినిమాలో ఉన్న విశేషాలు ఒకటా... రెండా.. ఎన్నని చెప్పమంటావు?"

"ఎన్నుంటే అన్ని చెప్పు..."

"ఓ మెగాస్టార్ నటించిన మెగా సినిమా అది. ఒకటేసారి ఆ సినిమాను నాలుగువందల ఇరవై ఒక్క థియేటర్లలో రిలీజ్ చేశారు.. ఇదొక రికార్డు... ఇంతవరకు ఏ తెలుగు సినిమా కూడా ఒకేసారి నాలుగు వందల ఇరవై ఒక్క థియేటర్లలో రిలీజ్ కాలేదు. చిన్నచిన్న టౌన్లలో కూడా ఈ సినిమాను రిలీజ్ చేశారు. అంతేకాదు.. విదేశాలలో కూడా ముప్పై ప్రింట్లతో ఈ సినిమాను రిలీజ్ చేశారు. ఈ సినిమాకు మొత్తం 285 ప్రింట్లు తీయడం కూడా ఒక రికార్డు. ఈ సినిమా విడుదలైన మొదటి వారంలోనే పదికోట్ల రూపాయల్ని వసూలు చేసిందట... ఇదీ ఒక రికార్డే! తెలుగు సినిమాలే కాదు.. ఏ హిందీ సినిమా కూడా విడుదలైన మొదటి వారంలోనే పదికోట్లు వసూలు చేసిన దాఖలాలు లేవుట..."

"ఈ సినిమా ఇంకో రికార్డును కూడా సృష్టించిందని విన్నాను..."

"ఏమిటది?"

"ఈ సినిమా విడుదలైన రోజు టిక్కెట్ల కోసం థియేటర్ల దగ్గర గుమిగూడిన ప్రజల తొక్కిసలాటలో ఐదారుగురు ప్రేక్షకులు చనిపోవడం కూడా ఓ రికార్డే కదా!"

"అవును... దీన్ని బట్టి ఈ సినిమాకు ఎంత బ్రహ్మాండమైన ఓపెనింగ్స్ వచ్చాయెూ ఊహించుకోవచ్చు."

"మొత్తమ్మీద తెలుగు సినిమాకు చాలా మంచి రోజులే వచ్చినట్టున్నాయి..."

"అవును... ఏడెనిమిదేళ్ళ క్రితం ప్రతీ మధ్యతరగతి కుటుంబం ఇంట్లోకి టీవీలు, కేబుల్ టీవీలు ప్రవేశించడంతో సినిమాలకు చాలా గడ్డు రోజులే వచ్చాయనుకున్నారు. ఎన్నో సినిమా థియేటర్లను మూసేసి, ఫంక్షన్ హాల్స్‌గా మార్చారు. ఆ పరిస్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. సినిమా థియేటర్ల దగ్గర తొక్కిసలాట జరిగేంతగా జనం సినిమాలు చూడటానికొస్తున్నారంటే సినిమాలను ప్రజలు ఎంతగా ఆదరిస్తున్నారో తెలియడం లేదూ?"

"తెలుస్తూనే ఉంది...ఇంతకూ నువ్వు ఇంత పెద్ద రికార్డులను బద్దలు కొట్టిన సినిమాను మొదటిరోజే ఎలా చూడగల్గావు?"

"ముప్పై రూపాయల టిక్కెట్‌ను మూడు వందల రూపాయలకు బ్లాక్‌లో కొనుక్కొని చూశాను.."

"వండర్‌ఫుల్! రెండువందల డెబ్బయి రూపాయలు లంచం పెట్టి చూశావన్నమాట. ఈ సినిమాలో కథేమిటో, సందేశమేమిటో చెప్పనే లేదు..."

"కథంటే మామూలు సినిమాల్లో ఉండే ఓ అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకోవడం.. ఒకరితో ఒకరు ప్రేమించుకుంటున్నామని చెప్పుకోకపోవడం... దాంతో అపార్థాలు.. అమ్మాయికి వాళ్ళ నాన్న గారు వేరే సంబంధం చూడటం, ఆ అమ్మాయిని ప్రేమించిన అబ్బాయొచ్చి

పెండ్లి పనులన్నీ చేయడం... తీరా పెండ్లి జరగబోయే సమయానికి ఆ అబ్బాయి ఎక్కడికో దూరంగా వెళ్ళిపోతున్నానని చెప్పి రైల్వేస్టేషన్‌కో, విమానాశ్రయానికో వెళ్ళడం... సరిగ్గా అప్పుడే వాళ్ళిద్దరూ ప్రేమించుకుంటున్నారని అందరూ తెలుసుకొని వేరే అబ్బాయితో జరగబోతున్న పెళ్ళిని ఆపేసి, అందరూ విమానాశ్రయానికి పరుగెత్తడం.. వాళ్ళద్దిర్నీ కలపడం.. ఇలాంటి అల్లాటప్పా కథనుకున్నావా ఏమిటి? లేకపోతే రాయలసీమ ఫ్యాక్షన్ కథల్లోలా ఒకర్నొకరు నరుక్కోవడంతో సాగే కథనుకున్నావా?"

"ఇప్పుడు ఏ సినిమా కథ చూసినా ఈ రెండు రకాల కథలే కదా... ఈ మెగా సినిమాలో ఇవేవీ లేవా?"

అస్సలే లేవు.... ఈ సినిమాలో ఉన్న కథ గొప్ప విప్లవాత్మకమైన కథ. మన సమాజంలోని వివిధ వర్గాల్లో... ముఖ్యంగా పోలీసు డిపార్టుమెంట్‌లోనూ, హాస్పిటల్స్‌లోనూ, మున్సిపాలిటీల్లోనూ స్థిరపడిపోయిన లంచగొండితనాన్ని ఈ సినిమా బట్టబయలు చేస్తుంది. లంచాలు తీసుకుంటున్న వాళ్ళను ఈ సినిమాలోని హీరో కిడ్నాప్ చేసి చంపేస్తుంటాడు. ఈ హీరో కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తుంటాడు... ఈ కాలేజీ ప్రొఫెసర్ ఏ.సి.ఎఫ్. అనే ఒక విప్లవాత్మక సంస్థను క్రియేట్ చేస్తాడు"

"ఏ.సి.ఎఫ్. అంటే ఏమిటో?"

"యాంటీ కరప్షన్ ఫోర్స్.. ఈ ప్రొఫెసర్ గారు ఒకప్పటి తన విద్యార్థులనందర్నీ ఈ ఫోర్స్‌లో సభ్యులుగా చేర్చుకొని వాళ్ళ ద్వారా ఏఏ ఆఫీసులో, ఏ ఏ ఆఫీసర్ ఎన్నెన్ని లక్షలు లంచాలుగా తీసుకున్నాడో తెలుసుకుంటాడు. అలాంటి లంచగొండి ఆఫీసర్లను కిడ్నాప్ చేసి చంపేస్తుంటాడు... ఈ సినిమాలో అన్నిటికంటే గొప్ప సన్నివేశం ఓ చనిపోయిన వ్యక్తి శవాన్ని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకురావడం... హాస్పిటల్లో ఉన్న డాక్టర్లు ఆ శవానికి వైద్యం చేసి, ఐదు లక్షల రూపాయల బిల్లయ్యిందని చెప్పడం... ఎన్ని విధాలుగా ప్రయత్నించినా అతన్ని అంటే ఆ శవాన్ని బతికించలేకపోయామని ప్రకటించడం.. ఆ హాస్పిటల్ అధికారులకు మన హీరోగారు వాళ్ళు జన్మలో మరచిపోలేని గుణపాఠం చెప్పి ఆ హాస్పిటల్‌ను మూసేయించడం... ఈ సినిమాను చూసిన వాడెవడూ లంచాలు తీసుకోవడానికి సాహసించడని నాకనిపించింది"

"ఇట్లాంటి సినిమాలు ఇదివరకూడా వచ్చాయనుకుంటాను..."

"అవును. కాని ఇంత ప్రభావాన్ని కలిగించిన సినిమాలు ఇదివరకు రాలేదని నా అభిప్రాయం"

"ఈ సినిమా వల్ల మన సమాజంలో పాతుకుపోయిన లంచగొండితనం పోతుందనే నువ్వనుకుంటున్నావా?"

"అవును..."

"సత్యహరిశ్చంద్ర సినిమా చూసిన వాళ్ళంతా సత్యమే చెబుతున్నట్టుంది నీ ధోరణి... సినిమాల వల్ల సమాజం మారితే అంతకన్నా కావలసిందేముంది.. ఎవరి దాకా ఎందుకు కనీసం ఈ సినిమా చూశాక నువ్వైనా మారావా?"

"మారాననే అనుకుంటున్నాను"

"ఇప్పుడు నువ్వు నా దగ్గరకెందుకొచ్చావో చెప్పనా?"

"ఎందుకొచ్చానంటావు?"

'మొన్న నువ్వు పద్నాలుగేళ్ళ మా రెండో అబ్బాయికి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించావు. ఆ 'మామూలు' వసూలు చేసుకుపోవడానికే కదా నువ్విప్పుడొచ్చింది?.."

"అవుననుకో... కానీ నేనిప్పుడు ఇలాంటి వాటికి ఇదివరకు తీసుకున్నంత పెద్ద ఎమౌంట్ తీసుకుంటలేను.. చాలా తక్కువ... నువ్వెంతిస్తే అంత తీసుకుపోదామని వచ్చాను..."

"సో, అదన్నమాట... ఆ సినిమా నీ మీద కల్గించిన ప్రభావం..."

చైతన్యపు గుమ్మం

పల్లవి :

అమ్మా వందనం - నీకిదే వందనం
చక్కనైనా మన ఖమ్మం - చైతన్యపు గుమ్మం ॥అమ్మా॥

చరణం :

1) తూరుపు దిక్కున ధాన్యాగారము
పడమరగ పోరాట దుర్గము
భద్రాద్రి, పాలేర్లు నీ కోట గోడలు
మణుగూరు, మధిరలు నీ కంఠహారాలు ॥అమ్మా॥

2) బౌద్ధ స్థూపాల నేలకొండపల్లి
దాశరథి కోటి రతనాల తల్లి
రామదాసు గానసుధా లహరి
నల్లబొగ్గు గని తరిగిపోని సిరి ॥అమ్మా॥

3) ఆసియాకే పేరు గన్నది
అశ్వాపుర భారజలము
పేపరు మిల్లు సారపాక
ప్రకృతి నిలయం భద్రాచలము ॥అమ్మా॥

4) కాకతీయ, రెడ్డిరాజుల
సాహస గాథల రణక్షేత్రము
పోరుబిడ్డల పొత్తిళ్ళ దాచిన
మహోజ్జ్వలం నీ చరితం ॥అమ్మా॥

5) ప్రజాకళలకు పట్టుగొమ్మవే
ఉద్యమ గంధాల పూలరెమ్మవే
మున్నేరు, కిన్నెర శబరి, గోదావరులు
పరవళ్ళు తొక్కె సొగసులమ్మవే ॥అమ్మా॥

6) ఖనిజ సంపదా - జీవనదులు
అపార వనరులు ఎన్నున్నగాని
ప్రజల బతుకేమో - దిగసిల్లిపాయె
అన్నంపెట్టే ప్రాజెక్టులె సున్నాయె ॥అమ్మా॥

7) ఏ కష్టమొచ్చినా ప్రజల మధ్యే ఉంటు
పోరుమార్గం చూసి బతుకుదారి చెప్పె
అలుపెరుగని నేత మన తమ్మినేని
మహాప్రస్థానంతో మన తోడునీడాయె ॥అమ్మా॥

8) తులారాం - దుమ్ముగూడెం
శ్రీరాంసాగర్ ఇత్యాది ప్రాజెక్టుల
ఉద్యమించి సాధించి తీరాలి
వీరుల ఖిల్లాని చాటి చెప్పాలి ॥అమ్మా॥

- సంపటం దుర్గా ప్రసాదరావు

ఆమె ఎవరైతేనేం....

తెగిన తంత్రుల్ని,
ఏకం చేసే ఒక మాట చెప్పండి.
వెన్నెల సాయంత్రాలలో పొలం గట్టుపై
నడిచిన సున్నిత పాదముద్రలను వెతకండి.
కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ముంబయ్,
మహానగరాన్ని మాత్రమే చుంబించదు
తెలుగు నేలను కూడా పలకరిస్తుంది
కిక్కిరిసిన రైలు బోగీలలో
గుట్కా తిని ఊసిన ఉమ్ములో
తెలుగుదనాన్ని నింపుకున్న అమ్మాయిలు
సామూహిక ఆకలి దుఃఖం తీరేందుకు
శరీరాన్ని అమ్ముకునేందుకు ముంబయ్, గోవా
సముద్ర తీర నగరాలకు వలసపోతున్న కన్నీటి చారికలు
ఎండి శుష్కించిన పల్లె
సుగంధ వాసన నిండిన మనియార్డరు కోసం
ఆశగా ఎదురు చూస్తుంది

* * *

పల్లెలు పచ్చదనాన్ని కోల్పోయి
ఉపనదులు, వాగులు, చెరువులు,
ఎండిన ఇసుక రేణువులయినప్పుడు
బతుకే చివరి ఆశ అయినపుడు
ఆడతనం ఆకలి తీర్చుతోంది

* * *

అంతా మాట్లాడుతున్నది
పులిరాజాకు ఎయిడ్స్ వస్తుందా... అని
జీవనకాంక్షతో శరీరాన్ని
వ్యాపార కేంద్రంగా చేసుకుంటున్న
చెల్లెళ్ళ గురించి ఇప్పుడైనా మాట్లాడదాం.

- అరసవిల్లి కృష్ణ

* పుష్పాల కృష్ణమూర్తి

పిల్లలను ఆడంబరాలకు దూరంగా వుంచాలి



ఆ రోజు శనివారం కావడంతో పిల్లలంతా స్కూలు డ్రస్సులకు బదులుగా రకరకాల దుస్తులు వేసుకుని వచ్చారు. నేను క్లాసుకు వెళ్ళేసరికి బాలబాలికలంతా తోటలోని సీతాకోక చిలుకల్లా ఉన్నారు. అందరిలోనూ అర్చనను చూసి అవాక్కయ్యాను. పెదాలకు లిప్‌స్టిక్, గోళ్ళకు రంగు, హైబ్రోస్ షేవింగ్‌తో వచ్చింది. హెయిర్ డ్రై వల్ల జుట్టు గాల్లో ఎగురుతోంది. వేసుకున్న మిడ్డీ మోకాళ్ళపైకి ఉంది. క్లాసులో అందరి చూపులూ, ఆ అమ్మాయి మీదే. ఆ అమ్మాయిని లేపి ఇది క్లాసనుకున్నావా? ఫాషన్ షో అనుకున్నావా? నీ సెవెన్త్ క్లాస్ చదువుకు ఇంత అప్పియరెన్స్ అవసరమా?" అన్నాను కోపంగా.

"మా మమ్మీకి ఇలా ఉండటమే ఇష్టం సార్. తనే తయారు చేయించింది" తలదించుకుని అంది.

నాకు వెంటనే ఏం మాట్లాడాలో తెలీలేదు.

కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రత్యేకంగా ఉండాలనుకుంటారు. చదువుల్లో, ఆటల్లో, పాటల్లో, చివరకు వేసుకునే దుస్తుల్లో కూడా. తప్పులేదు కాని ప్రత్యేకత పేరుతో వయస్సుకు మించిన అలంకరణలు, ఆలోచనలు, అనర్థాన్నే కొనితెస్తాయి.

మీడియా భూతం ఇంట్లోకి ప్రవేశించిన తర్వాత, ఆడా, మగా అనే తేడా లేకుండా పిల్లల నుండి వృద్ధుల వరకూ తన ఇనుప కౌగిలిలో బంధించి, తన మాయ ప్రభావంతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఆధునికత పేరుతో హింస, ఆడంబరాలు, విశృంఖల స్వేచ్ఛ, వస్తు వినియోగ సంస్కృతి వంటి అనేక అవలక్షణాలనే నాగరికతగా ప్రచారం చేస్తోంది. దీన్ని అర్థం చేసుకోలేని సామాన్యులు ఇట్టే టీవీ వ్యామోహంలో పడి అర్థం లేని ఆడంబరాలకు దాసోహమంటున్నారు.

టీవీ పెడితే వందలాది ఛానల్స్, మెరుపు తీగల్లాంటి మనుషులు, వాళ్ళ ఒంటిమీద తళుకులీనే రంగుల దుస్తులే అనుక్షణం దర్శనమిస్తాయి. కాని సగటు భారతీయ బాలల పేదరికం, అనారోగ్యం, ఆకలి వంటి విషాద రేఖలు డాక్యుమెంటరీల్లో తప్ప ఏ ఛానల్‌లోనూ కనిపించవు. "ఫాషన్ ఛానల్ గురించి చెప్పేదేముంది. ఎంత బాగా ఒళ్ళు కనిపించేలా దుస్తులు ఉంటే అదే మంచి ఫ్యాషన్‌గా చలామణి అవుతోంది. ఈ అలంకరణలు, ఆడంబరాలు 'వస్తు వ్యామోహ సంస్కృతికి', అంతిమంగా వ్యక్తి పతనానికి కారణమవుతున్నాయి. దీని ప్రభావం వల్ల అమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లో చదువుకునే అబ్బాయిలు తాగుబోతులుగా, హింసోన్మాదులుగా, జూదరులుగా, బాధ్యత లేని వారిగా, సంఘ విద్రోహులుగా మారిపోతున్నారు.

ఆడంబరాల వల్ల అర్థంలేని ఫ్యాషన్ల వల్ల ప్రజలకు నష్టాలు, పెట్టుబడిదారులకు లాభాలు మాత్రమే కనిపిస్తాయి. బాలల ప్రథమ లక్ష్యం విద్యార్జనగా ఉండాలి. దాన్ని వదిలేసి ఆడంబరాల వలలో చిక్కితే ప్రాథమికంగా చదువుకు దూరమవుతారు. మనిషిలో కృత్రిమతత్వం చోటు చేసుకుంటుంది. అబద్ధాలు, ఆడంబరాలు ఎప్పుడూ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుంటాయి. ఉన్న స్థితిని మరచిపోయి ప్రవర్తించడం అలవాటవుతుంది. డబ్బు, కాలం వృధా అవుతాయి. మధ్యతరగతి, కింది తరగతి వారిలో ఈ ఆడంబరాలు అశాంతిని, ఆవేదననే కలిగిస్తాయి. ఆడంబరాలకు ఆలవాలమైన ఇంట్లో శాంతి, సౌఖ్యం, సహజీవనం కన్పించదు.

దుస్తులు, ఆభరణాల వంటి అలంకరణ సామగ్రి కొనలేని పేదవారు నీచంగా చూడబడతారు. శ్రమజీవులు, వారు చేసే శ్రమ అవమానింపబడుతుంది. ఈ సౌందర్య సాధనాల వలన సహజ సౌందర్యం దెబ్బతింటుంది. శరీరంపై మచ్చలు, ముడతలు ఏర్పడటం, ఫ్యాషన్ పేరుతో చిక్కి టి.బి.కి గురవుతారు. కనుక సౌందర్య సాధనాలకు, సౌందర్య పోషణకు ఎంతదూరంగా ఉంటే అంతగా శారీరక, మానసిక ఆరోగ్యాలు బావుంటాయి.

ముఖ్యంగా టీనేజి పిల్లలు ఈ అందాలు, అలంకరణ పట్ల వెంటనే ఆకర్షింపబడే అవకాశముంది. శారీరక సౌందర్యం కన్నా మానసిక సౌందర్యమే గొప్పదనే విషయం గురువులతో పాటు తల్లిదండ్రులూ తెలియజెప్పాలి. పిల్లలు మారాం చేస్తే, అర్థమయ్యేలా చెప్పి దూరంగా ఉంచాలి. నిరాడంబరంగా జీవించిన గాంధి, మదర్‌థెరిస్సా, మండేలా వంటి మహనీయుల గాథల్ని తరచుగా వినిపించాలి. 'సింప్లిసిటీ ఈజ్ ద మెథడ్ ఆఫ్ బ్యూటీ' అనే విషయం పిల్లల మనస్సుల్లో నాటుకునేలా బోధించాలి. అప్పుడు పిల్లలు ఆడంబరాల మోజులో పడిపోకుండా పరిరక్షింపబడతారు. ●

అత్యాశ

జె. పురుషోత్తం

పాములు పట్టడంలో వీరయ్య మంచి నేర్పరి. వాటిని చంపి చర్మాలను అమ్మి ధనం సంపాదించేవాడు. ఒక రోజు వీరయ్య అడవికి వెళ్లాడు. అక్కడ ఓ పెద్ద పుట్ట కనపడింది. దాన్ని తవ్వేందుకు తన చేతిలోని గునపాన్ని పైకెత్తాడు. అప్పుడు పుట్టలోంచి ఓ పెద్ద పాము బయటికి వచ్చి "వీరయ్యా! నా పుట్టను నాశనం చేయకు. నన్ను చంపకు. నీ కుటుంబం బతకడానికి కావలసినన్ని బంగారు కాసులు నీకు ఇస్తాను. వాటితో జీవితాంతం ఏ సమస్యలు లేకుండా హాయిగా బతుకు. నీ ఎదురుగా వున్న కన్నంలో చెయ్యి పెట్టు. నా మహిమ వల్ల బంగారు కాసులు లభిస్తాయి. అవి తీసుకుని నన్ను వదిలిపెట్టు" అని వేడుకొంది.

వీరయ్య సంతోషంగా బంగారు కాసులు తీసుకుని ఇంటికి వెళ్లాడు. వాటితో సరుకులు, బట్టలు, నిత్యావసర వస్తువులు తెచ్చాడు. మిగిలిన ధనాన్ని విలాసాలకి వాడుకున్నాడు. కొద్ది రోజులకు ధనం మొత్తం అయిపోయింది. దాంతో గునపం తీసుకుని మళ్లీ పుట్టదగ్గరికి వెళ్లాడు. గునపాన్ని పైకెత్తగానే పుట్టలోంచి పాము బయటికి వచ్చి "వీరయ్యా, నీకు ఎంతో ధనాన్ని ఇచ్చాను. అయినా, మళ్లీ ఎందుకు వచ్చావు? ఎందుకు నా నివాసాన్ని ధ్వంసం చేయబోతున్నావు?' అని అడిగింది.

సమాధానంగా వీరయ్య "నాకు మరింత ధనం కావాలి. మర్యాదగా ధనం ఇస్తే సరి. లేదా నీ పుట్టని కూల్చి నిన్ను చంపి చర్మాన్ని అమ్మి ధనం సంపాదిస్తాను. తెలిసిందా?" అని హెచ్చరించాడు. "అయ్యయ్యో! అంత మాటనకు వీరయ్యా. నీకు కావాల్సినంత ధనం తీసుకుని వెళ్లు" అని బతిమిలాడింది.

నాటి నుండి వీరయ్య డబ్బు అవసరమైనప్పుడల్లా పామును బెదిరించి తీసుకెళ్లడం ప్రారంభించాడు. వీరయ్య చేష్టలకు విసిగిపోయిన పాము ఓ రోజు కోపంగా "మీ మానవుల మనస్తత్వమే ఇంత. కష్టపడకుండా లభించే సొమ్ము కోసం ఎగబడతారు. కావాల్సినదాన్ని అందుకోవడం కోసం ఎన్నో ఎత్తులు వేస్తారు. మాకు కోరల్లో మాత్రమే విషం వుంటే మీకు నిలువెల్లా విషమే. మేం కాటు వేస్తే విరుగుడు మందుతో ప్రాణాలు కాపాడుకోవచ్చు. కానీ మీరు వేసే దగా, నమ్మకద్రోహం వంటి కాట్లనుంచి బయటపడ్డం అసాధ్యం. అందుకు ఎటువంటి ఔషధాలు, నివారణలు లేవు. నేను దయతలచి ఎంతో ధన సాయం చేశాను. కానీ, నీవు అత్యాశకు పోయి నన్ను చీటికి మాటికి బెదిరిస్తూ ధనం వసూలు చేయసాగవు. నీలాంటి అత్యాశగల మనిషికి సహాయం చెయ్యడం చాలా తప్పు. ఇకనుంచి నీకు ఎటువంటి ధనసహాయం చెయ్యను. ఏం చేసుకుంటావో చేసుకో" అంది కోపంగా.

అంతే, విశ్వాసఘాతకుడైన వీరయ్య పాము చేసిన సహాయాన్ని మరచి గునపంతో పాము తలపై బాదబోయాడు. కాని పాము అతనికంటే వేగంగా కదలి కాలుమీద కాటువేసింది. వీరయ్య బాధగా అరుస్తూ పక్షవాతం వచ్చినవాడిలా వెనక్కి విరుచుకుపడి నురగలు కక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు.

పాము వీరయ్య శరీరంవైపు జాలిగా చూస్తూ 'పాపం, అత్యాశకుపోయి అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకున్నాడు. మానవునికి ఆశ వుండొచ్చు. కానీ అత్యాశ పనికి రాదు. వీరయ్య నా దగ్గరనుంచి తీసుకెళ్లిన ధనాన్ని వ్యసనాలకు ఖర్చు చేశాడు. పైగా అంత సహాయం చేసిన నన్నే చంపబోయాడు. తగిన శిక్ష అనుభవించాడు' అనుకుంది బాధగా.





క్విజ్-79

1. రెండంకెల పెద్ద సంఖ్య?
   ఎ. 10 బి. 99
2. భూగోళముపై భూమి భాగము?
   ఎ. 3/4 బి. 1/4
3. భారతదేశంలోని ఎడారి?
   ఎ. థార్ బి. అరేబియా
4. 'చిలుక సరస్సు' ఎక్కడ వుంది?
   ఎ. భారత్ బి. శ్రీలంక
5. 'ఆంధ్రకేసరి' అని ఎవరిని పిలుస్తారు?
   ఎ. టంగుటూరి ప్రకాశం బి. సి.ఆర్.దాసు
6. చలికాలంలో ఎటువంటి బట్టలు వేసుకుంటే మంచిది?
   ఎ. ఉలెన్ బి. కాటన్
7. అలెగ్జాండర్ ఏ దేశమునకు చెందినవాడు?
   ఎ. రోమ్ బి. గ్రీస్
8. హిందీలో ప్రముఖ నవలారచయిత?
   ఎ. ప్రేమ్‌చంద్
   బి. గోపీచంద్
9. నోబెల్ బహుమతి పొందిన ఇరాన్ మహిళ?
   ఎ. షిరిన్ ఎబాదీ
   బి. తస్లీమా నస్రీన్
10. ఈ ఫొటోలోని క్రీడాకారిణి పేరేమిటి?
   ఎ. పి.టి.ఉష
   బి. అంజూ జార్జ్

చుక్కలు కలుపుతారా!



చిన్నారి చిత్రకారులు

పిట్టల మనీష్ కుమార్,
5వ తరగతి, ఖమ్మం.



వి.సుమ, 4వ తరగతి,
సెయింట్ ఆంథోనీ హైస్కూల్,
హైదరాబాదు.

చింతోజు కార్తీక్ కుమార్, 3వతరగతి,
సేక్రెడ్ హార్ట్ ఇంగ్లీషుమీడియం స్కూల్,
మోత్కూర్, నల్గొండ.

నల్లగుళ్ల కనకరాజు,
7వ తరగతి, పామర్రు, కృష్ణా.

నాడిని కనుగొనే సాధనం



మేజిక్! మేజిక్!

మీరెప్పుడైనా డాక్టరుగారి దగ్గరకు వెళ్లారా? వెళ్లే వుంటారు. అప్పుడాయన ఏం చేశారు? ముందు మీ చెయ్యి పట్టుకొని నాడి చూసి వుంటారు. అవునా? గుండె ఎన్నిసార్లు కొట్టుకుంటుందో తెలుసుకోవడానికి అలా చేస్తారు. స్టెతస్కోప్ వంటి పరికరాలతో కూడా నాడిని లెక్కిస్తారు. అయితే మనం ఇవేవీ ఉపయోగించకుండానే గుండె ఎన్నిసార్లు కొట్టుకుంటుందో కనుక్కోవచ్చు. అదెలాగంటే.. ఒక పెద్ద అగ్గిపుల్లను తీసుకొని, దానిని ఒక డ్రాయింగ్ పిన్ను అడుగు కొనకి గుచ్చండి. ఇప్పుడు మీ ముంజేతిని బల్లపై వుంచి (బొమ్మలో చూపించినట్టుగా) డ్రాయింగు పిన్నుని మీ చేతిపై నాడి దొరికే చోట వుంచండి. గుండె కొట్టుకున్నప్పుడల్లా అగ్గిపుల్ల తల (మందు వున్న కొన) కొంచెం అటూ ఇటూ కదులుతుంది. తెలిసింది కదా! మరింకెందుకు ఆలస్యం? త్వరగా మీ గుండె ఎన్నిసార్లు కొట్టుకుంటుందో పరీక్షించుకోండి.

క్విజ్ 78కి జవాబులు

1.డార్విన్ 2.క్రెస్కోగ్రాఫ్ 3. చిరుతపులి
4. తాన్‌సేన్ 5. గోదావరి 6.గుప్తులు
7. హిమోగ్లోబిన్ 8. ఘర్షణ 9. పెట్రోలు.
10. చార్మినార్.

క్విజ్ 77కు సరైన సమాధానాలు రాసిన వారు :

పి.వసుంధర, 5వ తరగతి, **కె.వినీత్**, 6వ తరగతి, ఎమ్మిగనూరు. **జి.ఉజ్వల**, 9వ తరగతి, విద్యానగర్, గుంటూరు. **డి.నిర్మల**, 9వ తరగతి, పాత గాజువాక, విశాఖ. **ఎం.కిన్నెర**, 7వ తరగతి, **జి.కరుణాకర్**, 7వ తరగతి, **వి.వరుణ్**, 8వ తరగతి, విశాఖపట్నం.

కలం స్నేహం

పేరు: తెల్లాకుల తరుణ్,
వయసు : 5 సం॥
చదువు : 1వతరగతి
హాబీలు : టీవీ చూడడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా : **తెల్లాకుల తరుణ్, సన్నాఫ్ శ్రీనివాసరావు, బోనకల్లు, ఖమ్మం-507 204.**

పేరు: టి.విజయకుమార్,
వయసు : 9 సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు : క్రికెట్, క్యారమ్స్, చెస్ ఆడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : టి.విజయకుమార్, సన్నాఫ్ వెంకటేశ్వర్లు, ఇంటినెం: 7/22, నయానగర్, కోదాడ, నల్గొండ-508 206.

హాయ్... మీక్కూడా కలం స్నేహం చేయాలని వుందా! మరి ఆలస్యం ఎందుకు. ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే. మా చిరునామా : బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

రేగుపళ్లు



ఓ రోజు బీర్బల్ దర్బారుకు వస్తుండగా దారిలో రేగుపళ్లు అమ్మేవ్యక్తి కనిపించాడు. బుట్టనిండా నిగనిగలాడుతున్న పళ్లు కనిపించాయి. వాటిని చూడగానే కొనాలనిపించింది. కొని నేరుగా పాదుషావారి అంత:పురానికి వెళ్లాడు. చక్రవర్తి కూడా దర్బారుకి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. బీర్బల్ రాగానే 'ఏమిటి విశేషం? ఆ చేతిలో ఏమున్నాయి?' అనడిగారు. 'ప్రభూ! ఇవి రేగుపళ్లు. మంచి పక్వానికి వచ్చాయి. చాలా బాగున్నాయి. వీటిని చూడగానే నాకు తీసుకోవాలని బుద్ధిపుట్టింది. తీసుకున్నాను. ప్రభువుల వారు వీటిని ఆరగిస్తారని ఆశిస్తున్నాను' అన్నాడు బీర్బల్. చక్రవర్తి రేగుపళ్లు చూచి ఆనందించారు. వెంటనే రాణిగారిని కూడా అక్కడికి పిలిపించారు. బీర్బల్‌కు రాణిగారిదగ్గరకూడా చనువు వుంది. అందువల్లనే చక్రవర్తి రాణిగారిని పిలిపించారు.

ఒక పెద్ద పళ్లెంలో రేగుపళ్లు పోసి టేబుల్‌మీద పెట్టారు. రాణిగారు, చక్రవర్తి ఒక వైపు కూర్చున్నారు. బీర్బల్ వారికి ఎదురుగా కూర్చున్నాడు. ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ తినసాగారు. అక్బరు చక్రవర్తి రేగుపళ్లు తింటూ, అందులోని విత్తనాలను తక్కిన ఇద్దరూ గమనించకుండా రాణిగారు తిని పక్కకు వేస్తున్న గింజలలో పడవేయసాగారు. రాణిగారిని తిండిబోతుగా ఆటపట్టించాలన్నది పాదుషా ఉద్దేశం. రాణిగారు కూర్చున్నవైపు గింజలు ఎక్కువగా వున్నాయి. చక్రవర్తి దగ్గర గింజలు ఏమీ లేవు. బీర్బల్ దగ్గర కొద్దిగా వున్నాయి. అక్బరు నవ్వుతూ... 'పండిట్‌జీ! మీ మహారాణిగారు ఎంత తిండిబోతో చూశారా? ఆ గింజలు చూడండి. ఎన్ని వున్నాయో. అన్ని పండ్లు తిన్నారన్నమాట' అని ఆశ్చర్యం ప్రకటించారు. రాణిగారు సిగ్గుతో తల వంచుకున్నారు.

బీర్బల్ ఊరుకుంటాడా? నవ్వుతూనే చక్రవర్తికి చురక అంటించారు. 'మహారాణిగారికంటే ప్రభువులే ఎక్కువ తిండిబోతులుగా వున్నారు. మహారాణిగారు పండ్లు తిని గింజలు వదిలిపెట్టారు. పాదుషావారు గింజలను కూడా వదలకుండా మింగివేశారు. ఆ తిండి చూస్తే ఎవరు తిండిబోతులో అర్థమవుతూనే వుంది' అన్నాడు దెప్పిపొడుపుగా. దాంతో మహారాణివారి ముందు చక్రవర్తి సిగ్గుపడక తప్పిందికాదు.

పొడవైన వృక్షాలు

కాలిఫోర్నియాలోని సియెరానెవేడా పర్వతాలలో కనిపించే 'సెక్వోయా' వృక్షాలకు ఒక ప్రత్యేకత వుంది. ఇవి ప్రపంచంలోకెల్లా అత్యంత ఎత్తు పెరిగే వృక్షాలు. దాదాపు 300 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పు పెరుగుతాయి. ఇవి ఎంతకాలం జీవిస్తాయనుకుంటున్నారు? రెండు వేల నుంచి మూడు వేల సంవత్సరాల వరకూ! ఇప్పుడు జీవించి వున్న అతి పెద్ద సెక్వోయా పేరు 'జనరల్ షర్‌మన్'. ఇది 311 అడుగుల ఎత్తుంది. అంటే దాదాపు 27 అంతస్తుల ఎత్తన్నమాట. దీని మొదలు 36 అడుగుల వెడల్పు వుంటుంది. దీని బెరడు నాలుగు అడుగుల మందం వుంటుంది.



రుక్మిణి

కార్పొరేట్-ఫైవ్‌స్టార్ గుండెచప్పుళ్ళు

దప్పులు దమదమ మోగిపోతున్నాయి. వింటున్న జనాల గుండెలు బేజారెత్తిపోతున్నాయి. ఒకటే గుంపు! పెద్ద బజారు సావిడి నుండి గుడి దగ్గర రావి చెట్టు కిందకు వచ్చేసరికి గుంపునాపడం ఇక ఎవడివల్లా అయ్యేటట్లు లేదు. విపరీతంగా జనం వచ్చి గుంపులో చేరిపోతున్నారు - మరికొందరు ఈలలతో 'హుషారుకేకల'కు తగులుకున్నారు.

"ఏందిర ఈగోల... వార్నీ.. దసరా పండగ వెళ్ళిపోయిందిగద... అరె... వీండ్లకు పిచ్చిగాని లేసినాదిర!" జక్కులోడు చప్టామీద రెండు మునిగాళ్ళను నిగిడ్చి కొంగలా మెడ ముందుకు రిక్కరించి కసురుకుంటున్నాడు.

గుంపు మధ్యలో ఇద్దరు పులివేషాల వాళ్ళు చెవట్లు కారేలా పులిగంతులేస్తున్నారు. పల్టీలు కొడుతున్నారు. 'గాండ్రుగాండ్రుమని గుండెలవిసేలా గాండ్రింపులు... తోక జాడింపులు.. కదం తొక్కి పారేస్తుంటే, మరోవైపు అరడజను దప్పుదరువుగాండ్లు టమటమ జబ్బు సత్తువకొద్దీ దప్పుల్ని యమా బాదుడు బాదేస్తున్నారు. కోలాహలం? అయితే జక్కులోడు కండ్లు చికిలించి జాగ్రత్తగా చూస్తే ఆ రెండు పులులక్కాస్త అసింటా నల్లతోలు, బెత్తెడు తోకా వేసుకుని భయం నటిస్తూ.. ఉలికులికి పడుతూ నక్కి, నిక్కి చూస్తున్న 'మేక' ఓటి కనిపించింది. మేకవాడు మాత్రం వుండుండి పీలగా 'మే-మే' అని ఆర్తనాదాలు చేస్తున్నాడు.

"ఒరె మల్లేశా... ఈ పులివేషాలేందిర? ఆ మేకేందీ? ఈ డాన్సులూ.. చిందులూ ఏందటా? ఆ దప్పులు బాదుడేందీ.... ధు... ధు..." జక్కులోడు మాట ముగించేలోగానే దప్పుల టమ టమలు... గాండ్రింపులు నిలిచిపోయాయి. గబగబ రెండు పులులూ తోకలాడ్డించుకుంటూ చప్టామీదకెక్కి నిలబడ్డాయి. వాటి మధ్యలో సూటూబూటూ, టై తగిలించుకున్న జంటిల్మన్ ఒకసారి మొకమంతా నోరు చేసుకుని ఇకిలించాడు.

"మైడియర్ పేషంట్స్... ఓల్డ్‌మెన్... అంటే నా ప్రియమైన రోగులారా... మరియు ముసలి వాళ్ళలారా... ఆరోగ్యమే మహాభాగ్యం... ఆరోగ్యాన్ని మించిన సంపద లేదు. ఈ దేహం కడు విలువైనది.. మన శరీరంలో గుండె చాలా విలువైనది. కాపిటల్ అనగా అది రాజధాని వంటిది. దానికి కూడా బోలెడన్ని జబ్బులు... అనగా హార్ట్ఎటాక్... అంటే హృదయఘాతం... హారిబుల్... అబ్బా... అది రాకుండా మీరు జాగ్రత్త పడాల్సిన పనిలేదు. మీ రాజధాని గురించి మీరు చింతపడవద్దు. దానినలా వదిలేయండి - ఎందుకంటే దానికి ఎలాంటి 'పోటు' వచ్చినా... జబ్బు పడినా మా 'టైగర్ ఎమర్జన్సీ కేర్ యూనిట్' వుంది. మీ చెంత! మీకు అందుబాటులో ఫోన్ లేకుంటే మీరు కాకితో కబురంపి మీ గుండెను మా చేతుల్లో పారేసి మీరు నిశ్చింతగా కళ్ళు మూసుకోండి. దాన్ని శుభ్రం చేసి... కుట్లు వేసి మీ గుండెను మీకు మళ్లా అప్పగిస్తాం...

జక్కులోడు నోరు తెరిచాడు. మల్లేశుకి మతిపోయింది.

"ఈ దసరా దీపావళి నుండి - సంక్రాంతి వరకూ గొప్ప బంపర్ ఆఫర్! మీ గుండెలను విదేశీ నిపుణులు, విదేశీ పరికరాలతో పరీక్షించుటకు పూర్తి తగ్గింపు రేట్లు... మీలో ప్రతి ఒక్కరూ మీ మీ గుండెలను పరీక్షలు చేయించుకొనుటకు మిక్కిలి మహదవకాశం... ఈ పండుగ సీజన్లో పది నుండి యాభైశాతం వరకూ తక్షణ రిబేటు...

జనం గందరగోళంగా మారిపోయి చర్చల్లోకి దిగిపోయారు.

"వైల్డ్ ఫాక్సు క్యూర్ సెంటరోళ్ళు పేషంట్లను పట్టుకు వస్తే పదిశాతం కమీసను ఇస్తున్నారు. మీరెంతిస్తారు ? గురివిగాడు గోలగోలగా అరిచాడు. జంటిల్మెన్ కొంటెనవ్వు నవ్వాడు. "ఓ.కె.చెప్పరేం... మేం పాతిక పర్సెంటు కమీషను మధ్య దళారీకి ఇస్తాం. కమాన్ వెంటవెంటనే పేషంట్ల వెంటబడి ఆటోల్లో.. టాక్సీల్లో తోలుకురండి. ఓ.కె. మీ దళారీ కమీషను ఏజెంట్లకు మొత్తం కార్పొరేట్ రంగంలో ఎక్కడా కననీ.. విననీ బంపర్ ఆఫర్... అది గొప్ప విప్లవం... ఏదీ అదేంటో మీలో ఎవరైనా "చెప్పుకోండి చూద్దాం"! జంటిల్మన్ జనంతో కాసేపు హాస్యం చేసి అందరినీ నవ్వించాడు.

"వినండి... మీ కమీషన్ దళారీ ఏజంట్లందరికీ ప్రతి సంవత్సరం చివర్లో 'డ్రా' తీసి లక్కీ నెంబర్ తగిలిన దళారీని లండన్‌లో మా హాస్పిటల్ ఖర్చుల మీద పదిహేను రోజులు వినోద యాత్రకు పంపిస్తున్నాం. రెండవ నెంబరుకు రెండ్రోజులు రోమ్ పర్యటన... పదిమందికి ఉచిత కన్సెషను క్రింద ఏడాది పొడుగునా నెలకు మూడు రోజులు 'గుండె - దాని నొప్పులు - నివారణ'పై విదేశీ ప్రముఖులచే అధ్యయన తరగతులు మా ఖర్చులతో! వెంటనే గుండెకాయ పేషంట్లను పట్టుకు వచ్చే ఏజంట్లు తమ పేర్లు రిజిస్టరీ చేయించుకుని వెంటనే మేమందజేసే ఎలక్ట్రానిక్ వాచీని స్పాట్‌లో ఉచితంగా పొంది మీ ముంజేతికి అలంకరించుకోండి... "మళ్ళా టమటమ చప్పుడు - చప్టామీదనే పులివేషగాండ్లు తోకలూ... పిర్రలూ కదిలిస్తూ డాన్సుకు తగులుకున్నారు. జక్కులోడి బుర్రంతా తిరిగిపోయింది. అంతలో మరో బజార్నుండి పెద్దసైజు ఎలుగుబంటిని ఆడిస్తూ... పెద్ద పెద్ద టోపీలు ధరించిన బఫూన్ల వంటి వాళ్ళు భారీ శబ్దాలతో అటే రావడంతో అంతా కల్లోలమైపోయింది.

"ఎలిఫెంట్ ఎవ్రీకేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అన్నిట్లోనూ సౌకర్యం! ఒక ఆపరేషనుకు మరో ఆపరేషను ఉచితం! గుండె - సి.టి. చేయించుకుంటే విరిగిన తుంటి ఎముకకు ఫ్రీ ప్లాస్టరింగ్... ప్రతి వైద్యానికీ రాయితీల్లో నగదు కాకుండా మరో లింక్ చైను పథకం ద్వారా వుచిత వైద్య సౌకర్యాలు... దళారీ పద్ధతి లేదు. డైరక్ట్ ఎటాక్-" అట్లా మైకులో మరో జంటిల్మెన్ పెడబొబ్బలు పెడుతున్నాడు. మరి కాసేపటికి వాళ్ళు కలబడే సీను వచ్చేసరికి జక్కులోడు, మల్లేశం గుడివెనక్కి చేరారు.

"అరేయ్.. వాళ్ళు తలకాయలు పగలగొట్టుకుంటే కుట్లేసి - అతికించుకోడానికి వాళ్లకు వాళ్ళ వాళ్ళ ఆసుపత్రులున్నాయి గద! ఫర్వాలేదు - వాళ్ళని తన్నుకుని చావనీ"! మల్లేశు మాటలకు జక్కులోడు విరగబడి నవ్వాడు! ●

డాక్టరు నవ్వేడు

ఆవు గురించి వ్యాసం రాయమని అడిగినప్పుడు-

ఆవుకి నాలుగు కాళ్ళుండును... ఆవుకి ఒక తోక వుండును... ఆవు గడ్డి మేయును... ఆవు పాలిచ్చును.. ఆవు పాలు తెల్లగా వుండును... ఆవు పాలు శ్రేష్టము అనే టైపులో కొన్ని వాక్యాలు రాస్తే సరిపోవచ్చు. ఆ వాక్యాలన్నీ అక్షర సత్యాలే కావచ్చు. సూర్యచంద్రుల సాక్షిగా అదంతా నిజమే కావచ్చు. కానీ ఆ టైపు వాక్యాలు చదివేందుకు విసుగ్గా వుంటాయి. చదివించే సత్తా ఆ వాక్యాల్లో లేదని తెలిసిపోతుంది! ఆ అక్షరాలు వాటి పొందికా మనస్సుకి అతుక్కోవు. అందువల్ల చాలు చాల్లే ఊరుకోమని కోప్పడతాం! అంచేత - బాగా తెలిసిన విషయమైనా - కొత్తగా తెలుసుకుంటున్నామనే ధోరణి ఆ రాతలో కనిపించాలి! అప్పుడు అంబ పలుకుతుంది! ఆత్రంగా చదివిస్తుంది. చదివే కొద్దీ చదవాలనే కుతూహలం కలిగిస్తుంది. అద్భుతం అనిపిస్తుంది. రాసేమనిషి ఈ ధ్యేయానికి కట్టుబడి వుంటే - ఆ రచయిత ఎక్కాలు రాసినా ఆహా అనిపిస్తాయి! ఇదేదో రైటింగు టెక్నిక్కు గురించి చెబుతున్న పాఠమనుకుంటే క్షమించాలి! నేను నమ్మిన సిద్ధాంతమిది!

సగటు సంసారాల్లో సర్వసాధారణమైన సంగతులు చెప్పడమే 'ఇంతి సంగతుల' ధ్యేయం! మనకి తెలిసిన సంగతులే గదా అనే చిన్న చూపుతో - ఆవు టైపు వ్యాసమే గదా అనే చిరాకుతో - పేజీ తిప్పేస్తే నేనేంగాను? వదిలేయండి! అసలు విషయానికి వస్తాను. అదొక ఇల్లు. అద్దె ఇల్లో సొంత ఇల్లో అడగద్దు. ఆ ఇంట్లో అతను అద్దమ్ముందు నిలబడి వున్నాడు. ఒక చేతిలో తగలడే సిగరెట్టుంది. మరో చేతిలో రేజరుంది. చెంపలకి షేవింగు క్రీము అద్దబడి వుంది. ఇక క్షవర కళ్యాణమే తరువాయి కార్యక్రమం! ఆ పక్కనే వంటగది వుంది. ఆ గదిలో ఆమె వుంది. ఆమె ముందు కత్తి పీట వుంది. అక్కడే కాయకూరలున్నాయి. వాటిని ఆమె తరగడమే తరువాయి కార్యక్రమం!

ఆ గదిముందు చిన్న సైజు హాలు. ఆ హాల్లో చంటి వెధవ. గుర్రమో, ఏనుగో తెలీని బొమ్మతో వాడు ఆడుకుంటున్నాడు. సమయం ఉదయం ఏడున్నర. మరోగంటా గంటన్నరలో వంటవ్వూర్తి కావాలి. ఈలోగా అతను స్నానాదికాలు ముగించి భోంచేయాలి. ఆ తర్వాత సిటీబస్సు కోసం పరుగెత్తాలి. ఇదీ ఆ యొక్క వాతావరణం తాలూకు అర్ధ తాత్పర్యాలు. ఈలోగా ఈ బొమ్మకీ చంటి వెధవకీ పొత్తు కుదరలేదు. ఒకటీ రెండు తడవలు బొమ్మని కోప్పడ్డాడు. అయినా బొమ్మ దార్లోకి రాలేదు. తన మాట వినిపించుకోని బొమ్మతో కటిఫ్ చెప్పేడు. బతిమాలడం మానుకుని బొమ్మని విసిరికొట్టేడు. ఆ తర్వాత ఏడుపు ప్రారంభించేడు. ఏడుపు

వినగానే బిడ్డకేం జరిగిందోనని కూరలు తరిగే తల్లి గాభరా పడింది. తత్కారణంగా ఆమె వేలు తెగింది. నెత్తురు చిమ్మింది!

ఇటు గాయం చూసుకోవాలో అటు గారాల పట్టిని సముదాయించాలో తోచక భర్తని పిలిచింది. అద్దమ్ముందున్న భర్త విజిల్ ఆపి ఏమిటన్నాడు. ఏడ్చే పిల్లవాడ్ని సముదాయించమంటె రంకెలు వేస్తాడేమోనన్న భయంతో - వేలు తెగిందనే రెండో పాయింటు మాత్రమే చెప్పింది! భర్త ఆ మాట విన్నాడు. ఆమె వేలు తెగినందుకు అయ్యయ్యో అని గానీ - కనీసం అయ్యో అని గానీ అనలేదు. ఆదుర్దా అస్సలు పడలేదు. అద్దమ్ముందే నిలబడి - పంచదార అద్దుకో అని ఉచిత సలహా ఇచ్చేసి మళ్ళీ విజిలేసుకుంటో షేవింగు పనిలో పడ్డాడు! ఇప్పుడు వేలు తెగినా పట్టించుకోని సాక్షాత్తు ఈ మొగుడే - నాలుగేళ్ళ క్రితం... తనని ప్రేమించే రోజుల్లో... రైలు పట్టాల మీద ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని నడుస్తుండగా - ఆమె పాదం పట్టు తప్పి బెణికింది. కించిత్తు నొప్పి కలిగింది. అందువల్ల ఆ నొప్పి ఆమె చేత అమ్మా అనిపించింది!

అంత మాత్రానికే అతను అల్లాడిపోయేడు! నాకేం ఫర్లేదని ఆమె ఎంత చెబుతున్నా - అస్సలు అడుగుతీసి అడుగు వేయొద్దన్నాడు. రైలు పట్టాల్ని బండబూతులు తిట్టేడు. ఎంత వారిస్తున్నా వినకుండా ఆమెను ఎత్తుకున్నాడు. ఎత్తుకునే ఖరీదైన ఆసుపత్రికి తీసుకెళ్ళేడు. ఎక్స్‌రే, బీపీ, స్కానింగు వగైరాలు ఏర్పాటు చేయమని డాక్టర్తో వేడుకోలు చేసుకున్నాడు. అతని ఆదుర్దా గమనించి డాక్టరుగారు వేదాంత పరంగా నవ్వుకున్నాడు. ఆ డాక్టరు ఆ టైపు నవ్వెందుకు నవ్వేడో అప్పుడామెకు అర్థం కాలేదు!

ఇప్పుడు అర్థమవుతోంది. ప్రేమకి తిమ్మిరెక్కువ. కాలు బెణికినా, జలుబు చేసినా ప్రేమికుడు విలవిల్లాడిపోతాడు. నా ఆరాధ్య దేవతని ఆదుకోండని సమస్తమైన దేవతలందర్నీ పేరు పేరునా వేడుకుంటాడు. ఆ ప్రేమతో పెళ్ళి జరిగి నాలుగేళ్ళు గడిచిం తర్వాత కథ మారుతుంది! ఆమెకు వేలు తెగితే ఓర్చుకోమంటాడు. పంచదార అద్దుకోమంటాడు. కాలు విరిగితే ఖర్మ అనుకోమంటాడు. రెండో కాలుంది కదా అని గుర్తు చేస్తాడు. తెల్లజుత్తు డాక్టరు గారికి ఈ గొడవలన్నీ తెలుసు గనక - వేదాంత పరంగా నవ్వేసి వుంటాడని ఆమె అర్థం చేసుకుంటుంది. అందుకు నాలుగేళ్ళు పడుతుంది!

●

* వల్లభనేని సురేష్

హుషారు గొలిపే బోటు షికార్



బోటులో విహరించటమంటే సహజంగా ప్రతి ఒక్కరికీ ఎంతో ఉత్సాహంగానే ఉంటుంది. అదే రాష్ట్ర రాజధానిలో చారిత్రాత్మక హుస్సేన్‌సాగర్‌లో బోటుషికారు చేయటమంటే చెప్పాల్సింది ఏముంటుంది. రాత్రివేళల్లో సాగర్ జలాల్లో పడే విద్యుత్ కాంతుల ప్రతిబింబాలను చూస్తూ చల్లగాలికి విహరిస్తుంటే ఆ ఆనందానికి అంతేముంటుంది.

నగరంలో రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర పర్యాటక శాఖ హుస్సేన్‌సాగర్‌లో ప్రవేశపెట్టిన బోటుషికారుకు తప్పకవెళ్ళి తీరాల్సిందే. రోజు సాయంత్రం ఆరు గంటల నుండి రాత్రి పదిన్నర గంటల వరకు ఇవి సాగర్‌లో విహరిస్తాయి. ఇవి రోజుకు నాలుగు ట్రిప్పులు తిరుగుతాయి. ఒక్కో ట్రిప్పు సుమారు గంటన్నర పాటు వుంటుంది. దీనిలో రాత్రిపూట విహరిస్తూ ఉంటే చుట్టుపక్కల ధగధగలాడే విద్యుత్ కాంతుల అందాలతో పాటు సాగర్ అందాలు మధురానుభూతి కల్గిస్తాయి. లుంబినీ పార్కులోని సాగర్ నుండి బయలు దేరే రెండు బోట్లకు రెండు పేర్లు వున్నాయి. నగర సుందరులు భాగమతి, భాగీరథి అనే రెండు పేర్లను ఆ బోట్లకు పెట్టారు. వాటిలో భాగమతి పెద్దది. దీనిలో విహరించటానికి పెద్దలకు 75 రూపాయలు, పిల్లలకు 40 రూపాయలుగా నిర్ణయించారు. దీనిలో విహారంతో పాటు బార్ అండ్ రెస్టారెంట్ కూడా ఉంది. దీనిలో విహరిస్తూ మందు ప్రియులు షికారు ఏమోకాని మద్యంలో మునగటం మాత్రం గ్యారంటీ. దీనికి కిక్కుఎక్కించేందుకు పైన డాన్సుకూడాను. రెండవది బాగీరథి ఇది చిన్న బోటు. దీనిలో వంద మంది ఎక్కేందుకు సీట్లు వున్నాయి. దీనిలో ఎక్కేందుకు పెద్దలకు యాభై రూపాయలు, పిల్లలకు ముప్పై రూపాయలుగా టికెట్‌ను నిర్ణయించారు.

దీనిలో కూడా డాన్సే, ఈ డాన్సులు వేయటానికి డాన్సర్లను నగరంలోని వివిధ డాన్సు ఇన్‌స్టిట్యూట్‌ల నుండి తీసుకువస్తారు. ప్రభుత్వానికి ఎటువంటి అపవాదు రాకుండా దీనిని కూడా ప్రవేటు వారికి అప్పగించారు. వీరు రెండు బోటుల మీద డాన్సులు నిర్వహించేందుకు డాన్సర్ల కోసం టెండర్స్ పిలిచారు. అందిందే తడవుగా నగరంలోని కొంత మంది కాంట్రాక్టర్లు పోటీపడ్డారు.



టూరిజం లెక్కల ప్రకారం కాంట్రాక్టు మహిళకే దక్కింది. ఒక్కసారి కాంట్రాక్టు తీసుకున్నవారికి సంవత్సరం పాటు పూర్తిస్థాయిలో అధికారం ఉంటుంది. కాంట్రాక్టు తీసుకున్న మహిళ నగరంలోని వివిధ డాన్సు ఇన్‌స్టిట్యూట్‌ల నుండి డాన్సర్లను తీసుకుంది. దీనికి గాను నెలకు యువతులకు నాలుగువేలు, యువకులకు మూడువేల రూపాయలు జీతంగా ఇస్తుంది. నగరంలోని కూకట్ పల్లికి చెందిన కళామందిర్ డాన్స్ ఇనిస్టిట్యూట్, వడ్డేపల్లి డాన్స్ ఇనిస్టిట్యూట్, రిథమ్ డాన్స్ ఇనిస్టిట్యూట్, న్యూ స్టార్ డాన్స్ ఇనిస్టిట్యూట్‌ల నుండి డాన్సర్లను తీసుకుంది. వీరు నెలలో పదిహేను రోజులపాటు వుంటారు. మిగతా పదిహేను రోజులు వేరే డాన్స్ ఇనిస్టిట్యూట్ వారు వుంటారు. అంటే నాలుగు ఇనిస్టిట్యూట్‌లనుండి ఒక్కొక్కరు పదిహేను రోజుల పాటు వుంటారన్న మాట. ఈ విధంగా నెలకు రెండు షిఫ్టులు వుంటాయి. వీటిలో ఉన్న సీట్ల లెక్కల ప్రకారం ఒక సారి బోటు ట్రిప్పుకు వెళితే ఐదువేల రూపాయలన్న మాట. దీనిలో డాన్సర్లను తీసుకువచ్చిన కాంట్రాక్టర్‌కు ట్రిప్పుకు ఎనిమిది వందల రూపాయల చొప్పున ఇస్తారు. అంటే నాలుగు ట్రిప్పులకు కలిపి మూడువేల రెండువందల రూపాయలు. దీనిలో నెలకు డాన్సర్లకు పోను మిగిలినది కాంట్రాక్టరే తీసుకుంటుంది. డాన్సర్లలో డాన్స్ చేసే యువతులు ఇప్పుడు కూడా కూకట్‌పల్లిలో డిగ్రీ చదువుతున్నారు. వీరి వయస్సు ఇరవై సంవత్సరాలు ఉంటుంది. వీరి కుటుంబ పరిస్థితి మధ్యతరగతే. చిన్నప్పటి నుండి ఆసక్తితో నేర్చుకున్న డాన్సు ఇప్పుడు కుటుంబపోషణ కోసం ఉపయోగపడుతోంది. వీరిలో ఇద్దరు ముస్లిం యువతులు కూడా ఉన్నారు. వీరు గత ఐదు సంవత్సరాలుగా వీటిపై డాన్సులు చేస్తున్నారు. వారు బోటు బయలు దేరింది మొదలు మళ్ళా ఒడ్డుకు చేరేవరకు నాలుగు పాటలకు డాన్సులు వేశారు. ఎంతో చక్కగా ఎటువంటి అసభ్యతకు చోటు లేకుండా వారు డాన్సులు చేస్తారు. వీరిలో ప్రముఖంగా ఉన్న డాన్సర్ ఇరవై సంవత్సరాల సతీష్ మాట్లాడుతూ సుమారు ఐదు సంవత్సరాల నుండి దీనిపై డాన్సులు చేస్తున్నామన్నారు. సాయంత్రం ఐదు గంటలకు తమ ఇన్‌ఛార్జి దగ్గరకు చేరుకుంటామని, అక్కడనుండి తాము ఏ బోటులో వెళ్ళాలో ఆమె నిర్ణయిస్తుందన్నారు. తాను పదవ తరగతి వరకే చదువుకున్నానని తెలిపారు. చిన్నప్పటి నుండి ఉన్న ఆసక్తితో నేర్చుకున్న డాన్సే ఇప్పుడు తన కుటుంబానికి ఆదాయం తీసుకువస్తుందని చెప్పారు. తాను నెలకు రెండు షిఫ్టులలో కలిపి మూడు వేల రూపాయలు ఇంటికి తీసుకువెళతానని ఆయన చెప్పారు. తనతో పాటు డాన్సులు చేస్తున్న ఇద్దరు యువతులు కూడా తనలాగే తనతో పాటు డాన్సు నేర్చుకున్నారని, ఇప్పుడు వారికది కుటుంబాన్ని పోషించే ఆదాయ వనరుగా మారిందని తెలిపారు. నెలకు తాను సంపాదించిన నాలుగువేలలోనే డాన్సులకు సంబంధించిన బట్టలు కొనుక్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రతిసారీ ఒకే డ్రస్సు వేసుకుంటే తమను పిలిచిన కాంట్రాక్టర్ కోపగించుకుంటుందని, దీని కోసం తాము ప్రతి సారి నెలలో తీసుకున్న జీతంలో కొంత భాగం బట్టలకే కేటాయిస్తామని మిగిలినది ఇంట్లో ఇస్తామని వారు తెలిపారు. ఇక్కడ డాన్సులు చేస్తున్నవారి పరిస్థితి వర్ణనాతీతం. బోటులో ఏర్పాటు చేసిన వేలాది వాట్ల సంగీత సిస్టమ్స్‌కు అనుగుణంగా వారు డాన్సు చేయాలి. వీరు బోటు బయలు దేరిన తరువాత రెండు పాటలకు మాత్రం కొంత హుషారుగా డాన్సులు చేయగలుగుతారు. తరువాత ఇక వారి పరిస్థితి చెప్పటానికి వీలు కాకుండా వుంటుంది. తీవ్రంగా అలసిపోతారు. మరో పక్క కాంట్రాక్టర్ పిలుపులే పిలుపులు. దీంతో నీరుగారిన ముఖాలతో మరలా డాన్సు డెక్‌పైకి వస్తారు. అంతే అలసి సొలసి డాన్సులు చేశారు. చివరకు బోటు దరికి చేరటంతో గంటన్నర పాటు చూసిన డాన్సు గురించి చర్చించుకుంటూ బోటు షికారు చేసిన వారు దిగిపోతారు. ●

* హసన్ షరీఫ్

ఆసీస్ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ మాథ్యూ హేడెన్ జింబాబ్వేతో జరిగిన మొదటి టెస్టులో 380 పరుగులు చేసి చరిత్రపుటల్లోకి ఎక్కాడు. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా అతడు రికార్డు నెలకొల్పాడు. ఇది క్రికెట్‌లో తాజా చర్చకు దారి తీసింది. ప్రపంచంలో హెడెన్ అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అని ఆసీస్ టెస్టు కెప్టెన్ స్టీవ్ వా కితాబిచ్చాడు. సచిన్‌తో హెడెన్‌ను పోల్చలేమని భారత్ కెప్టెన్ గంగూలీ వ్యాఖ్యానించాడు. సచిన్ ప్రపంచంలో మేటి బ్యాట్స్‌మన్ అని వ్యాఖ్యానించాడు. సచిన్ గొప్ప క్రికెటర్ అయితే కావచ్చు గాక మ్యాచ్ విన్నర్ కాదని పాకిస్తాన్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యపై కూడా వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఇలా అనవసర వాదోపవాదాలు చోటు చేసుకోవడం ఎంతమాత్రం యుక్తం కాదు. ఇరువురి క్రీడాకారుల మధ్య పోలిక తీసుకురావడం, అనవసర వ్యాఖ్యలు చేయడం క్రికెట్ ఆటకు ఎంతమాత్రం మేలు చేకూర్చదు.

పోలిక అవసరమా?

ఇటీవల క్రికెట్ రంగంలో రెండు కీలక సంఘటనలు చోటుచేసుకున్నాయి. విశ్వవిజేత ఆస్ట్రేలియా జట్టుకు చెందిన మాథ్యూ హేడెన్ ప్రపంచ రికార్డు నెలకొల్పడం, అంతకుముందు మిస్టర్ డిపెండబుల్‌గా పేరుగాంచిన భారత్ వైస్ కెప్టెన్ రాహుల్ ద్రావిడ్ తన కెరీర్‌లో అత్యధిక స్కోరును సాధించడం ఈ రెండు ముఖ్య పరిణామాలు. ఆసీస్ జట్టులో నిలకడైన ఓపెనర్‌గా పేరు పొందిన హేడెన్ జింబాబ్వేతో పెర్త్‌లో జరిగిన మొదటి టెస్టులో 380 పరుగులు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పడం క్రీడాజగత్తులో అందరి దృష్టిని ఆకర్షించింది. తొమ్మిదేళ్ల క్రితం వెస్టిండీస్‌కు చెందిన లారా 375 పరుగులు చేసి నెలకొల్పిన రికార్డును హెడెన్ చెరిపేశాడు. అతడు రికార్డు సృష్టించడమే కాకుండా వేగంగా కూడా పరుగులు తీశాడు. ఆ టెస్టులో హేడెన్ ఆద్యంతం విజృంభించి ఆడాడు. మొదటి రోజు టీ విరామం తరువాత అతడు ఏకంగా 107 పరుగులు చేశాడు. 2001లో అతడు 1,391 పరుగులు చేశాడు. ఇంగ్లండ్‌పై స్వదేశంలో జరిగిన సిరీస్‌లో అతడు మూడు సెంచరీలు కొట్టాడు. జింబాబ్వేపై హేడెన్ చేసిన 380 పరుగుల స్కోరులో 11 సిక్సర్లు, 38 బౌండరీలున్నాయి. అతడు 437 బంతులను ఎదుర్కొని ఈ పరుగులు చేశాడు. లారా ఆంటిగ్వాలో ఇంగ్లండ్‌పై 375 పరుగులు చేసి నెలొకొల్పిన రికార్డును హెడెన్ అధిగమించాడు. ఆస్ట్రేలియాలో ట్రిబుల్ సెంచరీ చేసిన రెండో బ్యాట్స్‌మన్‌గా హెడెన్ ఘనత సాధించాడు. 1965లో ఆస్ట్రేలియాకు చెందిన రాబర్ట్ కోపర్ తొలిసారిగి ఆస్ట్రేలియా గడ్డపై ట్రిబుల్ సెంచరీ చేశాడు. స్లాటర్, మార్క్ టేలర్, ఆల్‌టైమ్ గ్రేట్ డాన్ బ్రాడ్‌మన్ రికార్డులను కూడా హెడెన్ అధిగమించాడు. ఈ ట్రిబుల్ సెంచరీ కారణంగా హెడెన్ వరల్డ్ ర్యాంకింగ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. అతడు 893 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. నిలకడైన ఆటకు మారుపేరైన హెడెన్ గత 12 టెస్టుల్లో ఐదు సెంచరీలు చేశాడు. విడ్ 849 పాయింట్లతో మూడో స్థానం పొందాడు. రెండో స్థానం



లారా(887)కు దక్కింది. హెడెన్ రికార్డు సహజంగానే తాజా చర్చకు దారితీసింది. హెడెన్ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అనీ, అలా కాదనీ చర్చ వాదోపవాదనలు ఆరంభమయ్యాయి. అతడు నిస్సందేహంగా అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అని ఆసీస్ టెస్టు కెప్టెన్ స్టీవ్ వా వ్యాఖ్యానించాడు. హెడెన్ ఆల్‌టైమ్ గ్రేట్ అని అభివర్ణించాడు. భారత్ కెప్టెన్ సౌరవ్ గంగూలీ దీనితో విబేధించాడు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అనడంలో సందేహం లేదని అతడు పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో అహ్మదాబాద్‌లో జరిగిన మొదటి టెస్టులో విఫలమైనప్పటికీ సచిన్ నిస్సందేహంగా గొప్ప బ్యాట్స్‌మన్ అని గంగూలీ కొనియాడాడు. ప్రపంచ రికార్డు నెలకొల్పినంత మాత్రాన సచిన్‌ను అధిగమించగలడనుకోవడం భ్రమ మాత్రమేనని వ్యాఖ్యానించాడు. సచిన్ ఎన్నడూ రికార్డుల కోసం ఆడలేదని అన్నాడు. నిలకడగా ఆడటం, టెక్నిక్ విషయంలో సచిన్‌కు సాటి రాగలవారు మరొకరు లేరని పేర్కొన్నాడు. తమ కెరీర్‌ను ఇప్పుడే ఆరంభించిన వారిని, సచిన్ చేసిన స్కోరులో సగం కూడా చేయని వారిని అతనితో పోల్చడం వింతగా ఉందని అన్నాడు. అయితే ఇద్దరిలో ఎవరు ఉత్తమ బ్యాట్స్‌మన్ అనే విషయంపై వివాదం అనవసరం. ఎవరి శక్తిసామర్థ్యాలు వారివి. ఎంతటి ప్రతిభావంతుడైనా పరిస్థితులకు అనుగుణంగా ఆడటం అవసరం. జింబాబ్వేతో జరిగిన టెస్టులో ఆది నుండి ఆసీస్ ఆధిక్యత ప్రదర్శించింది. ఇది రికార్డు బ్రేకింగ్ ఇన్నింగ్స్ ఆడటంలో హెడెన్‌కు సహకరించింది. పాకిస్తాన్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ కూడా ఇటువంటి అనవసర వివాదానికి తెరలేపాడు. సచిన్ మ్యాచ్ విన్నర్ కాదని, అతడు గొప్ప బ్యాట్స్‌మన్ మాత్రమేనని అతడు చేసిన వ్యాఖ్య విమర్శలకు దారితీసింది. గతంలో కూడా అతడు ఇటువంటి వ్యాఖ్యే చేశాడు. సచిన్ కంటే ఇంజమామ్ మేలైన బ్యాట్స్‌మన్ అని అతడు వ్యాఖ్యానించాడు. ఇలా ఇద్దరి మధ్య పోలిక తీసుకురావడం యుక్తం కాదు. ఎవరి ఆట తీరు వారిది, ఎవరి పరిమితులు వారికి ఉంటాయి. ఇక రాహుల్ ద్రావిడ్ సాధించిన రికార్డు కూడా తక్కువదేమీ కాదు. అతడు న్యూజిలాండ్‌తో అహ్మదాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో 222 పరుగులు చేసి జట్టు బ్యాటింగ్‌కు మూలస్తంభంగా నిలిచాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ అతడు రాణించి 73 పరుగులు చేశాడు. అతడు వేగంగా కూడా ఆడాడు. మిస్టర్ డిపెండబుల్‌గా పేరుగాంచిన ద్రావిడ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను నిర్వర్తించడంతో పాటు అటాకింగ్ బ్యాట్స్‌మన్‌గా కూడా రాణించగలనని నిరూపించుకున్నాడు. అతడు విజృంభించి బ్యాటింగ్ చేయడంతోనే భారత్ ఐదు వికెట్ల నష్టానికి 500 పరుగుల స్కోరుకు ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో కూడా సెహవాగ్, సచిన్ వేగంగా పరుగులు చేయడానికి ప్రయత్నించి వికెట్లు కోల్పోగా ద్రావిడ్ వికెట్‌ను కాపాడుకోవడంతోపాటు బిగ్‌హిట్టింగ్‌కు కూడా పోయి 73 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను గంగూలీ తొందరగా డిక్లేర్ చేయడానికి తోడ్పడ్డాడు. ●

✻ పెద్దింటి అశోక్ కుమార్

గురిజ గింజలు

ఉప్పలయ్య నొగలు వట్టి ఎడ్ల బండిని లావట్టిండు. ఎడ్లు సైర మీదున్నయి. వలుపటి పుల్లది దాపటి పయ్యది కాని కిందికి వచ్చి నిలవడ్డయి.

ఎడ్ల మెడలకు జోళ్ళు కడుతూ “వీళ్ళకు నిండిన్నాడు వద్దంటరు. ఎండిన్నాడు కావాలంటరు. వీళ్ళు ఏడ్సిన్నాడు మేము ఏడ్వాలె. వీళ్ళు నవ్విన్నాడు మేము నవ్వాలె. మా బతుక్కు సంతంగా అవుసరాలు గూడా ఉండయనుకుంటరు...” అన్నాడు. అంటూ పగ్గాలు, ముల్లుగట్టె, గొడ్డలి, కొడవలి చేతవట్టుకుని బండి ఎక్కి కూసున్నాడు.

క్షణంలో బండీ కదిలేదే! సుంకరి కిట్టడు బజారెంట పోతా బండికి అడ్డం తిరిగిండు.

“ఏంరా... ఉప్పలి... యాడికిరా బండి? జంగల్‌కు పోతున్నవా ఏంది?” అనుమానంగా అడిగిండు.

ఉప్పలయ్య తల ఎగురేసి కిట్టడిని బిరుసుగా చూసిండు. చూసి ఎడ్లను అదిలిస్తూ “ఔను. జంగల్‌కు పోతున్నం బండెడు పొయిల కట్టెలు నరుక్కత్త...”

ఉప్పలయ్య మాటలు పూర్తి కానేలేదు. బండి కదిలింది. ఎడ్లను అదిలిస్తూ బండిని ఆపిండు కిట్టడు. “ఏంరా... తలుకాయుండే మాట్లాడుతున్నవా...? పొద్దున చాటింపు వినలేదా....? ఐదునూర్ల జరుమానా కట్టబుద్దయితుందా...?” కోపంగా అడిగిండు.

ఎడ్లు రెండు అడుగులు వెనక్కి వేసి కిట్టన్ని చూస్తూ నిలవడ్డయి.

“ఔను. నువ్వెప్పుడత్తవో కట్టగట్టి ఇత్తామని ఐదునూర్లు దాచి పెట్టిన. నాకెవడు..? జరుమానా ఏసేటోడు. బండికి అడ్డరాకు. ఎడ్లు తొక్కి సంపుతయి.” ఎడ్లను అదిలిస్తూ అన్నాడు ఉప్పలయ్య.

బండి నాలుగడుగులు ముందుకు పోయింది. బర్రి కట్టెతో ఎడ్లను అదిలించి మళ్ళీ నిలిపిండు సుంకరి కిట్టడు.

“ఒరే ఉప్పలీ... నేను చెప్పింది ఇను. జంగల్‌ల కట్టెగొట్టద్దని వనసంరక్షణ సమితి వాళ్ళు నిర్ణయించిండ్రు. కట్టెలు గొడితే జురుమానేత్తరు.లేదంటే కేసు పెడుతరు. వాళ్ళకు అధికారముంది. సుంకర్లందరిని కావలి గాయిమని చెప్పిండ్రు. ఒక్క బండిని పట్టుకున్న సుంకరికి నూర్రూపాయలిత్తరట. నిన్న రెండు బండ్లను అప్పజెప్పిన. మొన్న మనిషికో రెండు మూడు బండ్లు దొరికినయి. వాళ్ళు రాత్రిపూట దొంగతనంగా అడివికిపోతూ దొరికిండ్రు. నువ్వేమో పట్టపగలే బండిగట్టినవు. మనోడివని చెబుతున్న ఎవ్వలకు తెలువకముందే బండి ఇడువు” హితబోధ చేస్తున్నట్లుగా అన్నాడు.

ఉప్పలయ్య బండిని అదిలించలేదు కాని కిట్టని వైపు కోపంగా చూసిండు. చేతుల పగ్గాలను మలేసి గుంజి పట్టుకుంటూ “ఒరేయ్ కిట్టా.. ఆకలితో కడుపు మండుతున్నోన్ని. నాకు నీతులు జెప్పకు. నువ్వు ఎవ్వలతోటి చెప్పుకుంటవో చెప్పుకో. నాకు అడ్డమచ్చేటోడు ఎవడో చూస్త” అన్నాడు.

ఈ అలికిడికి ఉప్పలయ్య భార్య నీల, ఆరేండ్ల కొడుకూ బయటికి వచ్చి నిలవడ్డరు. బజారు పొంట పోయే ఇద్దరు ముగ్గురు ఆగి నిలవడ్డరు. చుట్టుపక్కల ఇండ్ల నుంచి బయటకచ్చిసూత్తండ్రు.

“వండుకుందామంటె కాటెడు పుల్లలేదు. ఎవలనడిగితే ఎవలిత్తరు. మరి బతుకుదుమా! సత్తుమా! తెలివున్నోళ్ళు ఏ రాత్రో పగలో తెచ్చుకుంటండ్రు. ఈ మనిషి ‘సూడుండ్రోయ్ సుతారమని’ అందరి ముందే బండి గట్టె...” నీల నాలుగడుగులు ముందుకేసి అన్నది.

“ఏం... ఎవని ఇల్లు దోసుకత్తన్నా... ఏమన్న ఎత్తుకత్తున్నా..? నా ఇష్టమున్నప్పుడు పోత నాబుద్దున్నప్పుడు కట్టెలు కొట్టుకత్త. రాత్రో పగలో ఎందుకు పోత. జంగల్ ఎవనవ్వ జాగిరి? చెట్లు పెట్టిండ్రా.. నీళ్ళు పోసిండ్రా...?” ఆవేశంగా అంటూ రెండెడ్ల తోకలను అందుకున్నాడు ఉప్పలయ్య.

ఎడ్లు చెంగుమన్నాయి. బండి ముందుకు కదిలింది. ఈసారి సుంకరి కిట్టడు ఆపలేదు. ఉరిమినట్టు చూస్తూ పక్కకు జరిగిండు. జరుగుతూ చుట్టూ చూసి ఎంత దూరం పోతవులే... ఊరి పొలిమేర దాటక ముందే ఆపుత అనుకున్నడు. అనుకున్నట్టుగానే బండికంటే వేగంగా ఊరిలోకి నడిచిండు. బండి అడవి వైపు కదిలింది.

బండి గుడి గడ్డ దాటి వాగులకు దిగిందో లేదో... నలుగురు సుంకరోళ్ళు సైకిళ్ళ మీద అడ్డం తిరిగిండ్రు. ఆ వెనుకనే స్కూటర్ మీద ముగ్గురు రైతులు దిగిండ్రు. సుంకరోళ్ళను ఎగేసి వాళ్ళకు వినకపోతే తర్వాత మా వంతు అన్నట్టు దూరంగా మౌనంగా

నిలబడ్డరు.

ముందుగా బండిని గెదుమాలని చూసినా సుంకరోళ్ళ చేతులల్ల కొడవండ్లను చూసి ఆగిపోయిండు ఉప్పలయ్య. "కొడుకులు ఎడ్లమెడల మీది జోళ్ళను కోసినా కోసేత్తరు అనుకుని 'ఓవ్' అని బండి ఆపుతూ' 'ఆ... ఏంది చెప్పండ్రి' అన్నాడు.

"చెప్పుడు లేదు గిప్పుడు లేదు. బండి ఎనుకకు మలుపు. చెప్పేటోళ్ళు పంచాది ఆఫీసు కాడున్నరు" తనే బండిని మలుపుతూ అన్నడు సుంకరి కిట్టడు మళ్ళీ... "లేసినోడు లెవ్వనోడు అందరు మొనగాల్లే అయిండ్రు. ఒక్కన్ని గట్టిగా తొక్కితే ఇంకోడు సప్పుడు జెయ్యడు. వీనయ్య సంపాయించి పెట్టిండట. బండి గట్టుకుని ఉరుకుతండు" తనే అన్నాడు.

"ఔ.. నాఅయ్య సంపాయించలేదు. నీ అయ్య గిట్ల సంపాయించినాడ్రా! లావు లావు నీల్గుతున్నవు" బండిమీదనే లేచిండు ఉప్పలయ్య.

"ముందు బండి నడువని" ఒక సుంకరి అన్నాడు. మరొకడు బండి ఎక్కిండు. పగ్గాలు అందుకోబోతుంటే ఎనక్కితోస్తూ అన్నాడు ఉప్పలయ్య. "నాకు తెలుసురా... మీరు పెంచుకున్న కుక్కలని, బుక్కెడు కూడు కొరకు ఎవలమీదికైనా మొరుగుతరని. పొండ్రిరా... వాళ్ళతోని గాకపోతే వాళ్ళ తాతలతోని మాట్లాడుతా."

కోపంగా బండిని మలిపి ఊరివైపు గెదిమిండు ఉప్పలయ్య. గెలిచినందుకు సుంకర్లు మీసాలు దిద్దుకున్నరు. సమస్య తమదాకా రానందుకు స్కూటర్ మనుషులు నిరాశగా వెనక్కి తిరిగిండ్రు.

ఎడ్లబండి పోతున్నంత దూరం దుమ్ము ఎగిరి పడుతుంది. ఎక్కడ మళ్ళీ ఎనుకకు మలుపుతడో అనుకుని సుంకర్లు సైకిళ్ళు పట్టుకుని ఎనుకనే నడుత్తండ్రు. స్కూటర్ మాత్రం ముందెళ్ళిపోయింది. వెళ్తూ వెళ్తూ సుంకర్లకు ఏదో చెప్పిపోయిండ్రు.

"మేము వచ్చే వరకు జమ గొట్టుండ్రి..." కిట్టడు దుమ్మలనే నిలవడి కేకేసిండు.

ఉప్పలయ్య సల్ల పెల్ల మసులుతుండు. పండ్లు బిగవట్టి ఎడ్లను ఉరికిత్తండు. లోపల లోపల అందరినీ తిడుతుండు. ఊరు జొచ్చినంక తిట్లుగూడా అందుకున్నడు.

"నిండి వాళ్ళున్నరు. ఎండిమేమున్నము. కట్టెలు గొట్టుక రావద్దంటరు. పొయ్యిల ఏంబెట్టి వండుకోవాలె. మోకాళ్లు బెట్టాలెనా...? వాళ్ళకు సిలిండర్లు, పెండపొయ్యిలాయె. మా పెండ్లాలు గొట్టం వట్టనిది ఎల్లదాయె. ఇట్లంటే ఇదో తప్పు. మా అంతల మమ్ములను బతకనియ్యరు. గెలిగిచ్చి కయ్యం బెడుతరు..."

అప్పటికే ఈ ముచ్చట ఊరంతా ఎలానయింది. ఉప్పలయ్యను, ఎడ్లబండిని కొంతమంది జాలిగా చూస్తే మరికొంత మంది కోపంగా చూస్తుండ్రు. కొంతమంది ఏమైతదోనని ఆసక్తిగా ఎంబడి బోతండ్రు.

"వీళ్ళు ఎప్పుడూ ఇంతే... ఎప్పుడూ వానిదే సాగాలంటరు. కాలుకెత్తే మెడకేత్తరు. మెడకేత్తే కాలుకేత్తరు. వీనికి కావురంగాకపోతేంది...? కట్టెలు గొట్టద్దని ఊరంతా కట్టయినంక బండిగడుతడా...? మెడబలిమి తనం బాగుంది... ఏమన్నంటేసాలు. కులంతోని తిట్టిండ్రని కేసులు వెడతరు..." ఎనుక ముచ్చట్లు గుసగుసలు.

ఉప్పలయ్య బండిని పంచాది ఆఫీసు ముందు ఆపిండు. అప్పటికే యుద్ధానికి సిద్ధమయినట్టు మంది జమకూడిండ్రు. ఏమేం అడుగాల్నో నిర్ణయించుకున్నరు. ఉప్పలయ్య రాకతో శత్రురాజును చుట్టముట్టినట్టుగా చుట్టుకున్నరు.

ఉప్పలయ్య వనుకలేదు, జనుకలేదు. నడిబజార్ల బండి ఇడిసి ఎడ్లను పగ్గాలతో పయ్యలకు కట్టేసిండు. "ఏందిరా... నడిబజార్ల ఇడిత్తివి. పక్కకు ఇడువు. టాక్టర్లత్తయిపోతయి." ఉపసర్పంచ్ అదిలిచ్చిండు.

"తెల్లారనీ పొద్దుగూకని... పంచాది తెగేదాక బండి ఆడనే ఉండాలె. టాక్టర్లకు తొవ్వనే లేదా..." వెటకారంగా అన్నడు ఉప్పలయ్య. ఎవరో ఎడ్లను అదిలించబోయారు. అవి కొమ్ములు ఊపుతూ బుస్సుమన్నయి.

ఉప్పలయ్య లుంగీ సదురుకుంటూ ఆఫీసులకు నడిచిండు. వెంట తెచ్చుకున్న కొడవలి, గొడ్డలి, ముల్లుగట్టి చేతులనే ఉన్నయి. కుర్చీల మీద సర్పంచ్, వాడ నెంబర్లు, సంఘాల పెద్దలు కూసున్నరు.

"ఏందిరో... కొడవండ్లు, గొడ్డండ్లు తెత్తున్నవు. నరుకుతవా ఏంది...?" జోక్ జేసాడు వాడనెంబరు. అతడి మాటలు ఎక్కిరింతగా ఉన్నాయి.

"ఔ... మా పని అదేనాయె! అట్ల నరికెటోన్నయితే ఇట్ల అడ్డం దిరిగే దమ్ములు మీకుండునా....?" విసురుగా అన్నాడు ఉప్పలయ్య. అన్నదమ్ముల గెట్ల పంచాదిల తమ్ముని మీదికి గొడ్డలితో ఉరికిండని నెంబరు మీద నాలుగైదేండ్ల కింద కేసు నడిచింది. ఈ మాటలు నెంబరుకు అక్కడ తలిగినయి. వెంటనే పొడినవ్వు నవ్వుకుంటా భుజాలు తడుముకున్నడు నెంబరు. మళ్లా నోరు తెరువలేదు.

నెంబరును నోరు దెరవని మాట అన్నందుకు అందరూ ఉప్పలయ్య వైపు జడుసుకుంటున్నట్టుగా చూసిండ్రు. సర్పంచ్ మాత్రం పెద్దరికంగా మాట కదిపిండు.

"అరే ఉప్పలయ్యా.. ఇది మా మాటగాదురా... గవుర్నమెంటు ఆడరు. చెట్లు గొట్టద్దట. వానలు పడయట. వీలైతే ఒక చెట్టు వెట్టాలెగనీ చెట్లను నరుకద్దంటుండ్రు. నీకు తెలువకగాదు. నువ్వు సదువుకున్నోనివే! మన ఊరికి విఎస్సెస్ కమిటీ గూడా వేసిండ్రు. వారం రోజుల నుంచి నువ్వు సూడనే వడితివి. ఎంతమందికి జురుమానవెయ్యలేదు......" అతడు మాట్లాడుతున్నంత సేపు అందరు మౌనంగా ఉన్నరు. మాటలు పూర్తికాక ముందే ఉప్పలయ్య అడ్డుతలిగిండు.

"ఔ.... పటేలా... మేము కట్టెలు ఎందుకు కొడుతున్నం...?" అడిగిండు. సర్పంచ్ చెప్పలేదు కాని ఎందుకన్నట్టు గంభీరంగా చూసిండు... ఉప్పలయ్య మధ్యలో నిలవడ్డడు. వాళ్ళు చుట్టూ కుర్చీల మీదకూసున్నరు.

"మేమేం అమ్ముదుకు దెత్తున్నమా... ఇండ్లు గట్టుదుకుదెత్తున్నమా...? పొయ్యిలకు దెత్తున్నము. వండుక తినుదుకు దెత్తున్నము..."

"అదే మేము అనేది. ఇట్లనే ఊరందరు అంటరు. ఇంటికి బండెడు దెత్తరనుకో.... జంగల్ ఏంగాను..." రెడ్డి సంఘం పెద్ద అందుకున్నడు.

"ఏంగాదు. నువ్వు చీకోటి మామిండ్లను బొగ్గు బట్టీకి అమ్మినప్పుడు ఏమైంది...? తాతల నాటి తుమ్మ చెట్లను, చింత చెట్లను కట్టె కోతకు అమ్మిన్నాడు ఏమైంది? అడివినంతా నరికి టేకు చెట్లను దెచ్చి ఐదుగురు కొడుకులకు ఐదు ఇండ్లు గట్టినవు చూడు... అప్పుడేమైంది...?...."

ఆ మాటలకు రెడ్డి సంఘం పెద్దకు చిర్రెత్తుకొచ్చింది.

"ఒరేయ్... అవన్నీ నా పట్టా భూములు. నా భూములల్ల నా బుద్దున్న పని చేసుకుంట. అవ్వి అడుగుడుకు నువ్వెవ్వలు...." కోపానికచ్చిండు.

ఉప్పలయ్య ఏదో అందామనుకున్నంతలోనే వెనుకనుండి రాజాలు మాటలు విపించినయి. "ఔనయ్యా! మీ పట్టా భూములల్ల నరికేటప్పుడు మీకు ఏదీ యాదికి రాలేదు. చెయ్యాల్సిందంతా చేసింది మీరు. ఇయ్యల్ల మాపొయిల కట్టెలకు కట్టుబందు జేసిండ్రు. మేము ఇప్పుడు ఎటువోవాలె:..."

రాజాలు నిన్ననే జురుమాన గట్టిండు. ఎవలూ చూడరని అర్ధరాత్రి బండి గట్టిండు. ఇల్లు పక్క ఇల్లే సుంకరిది. నిలువు బండిని దొరకవట్టిండు. కట్టెలు సర్పంచ్ కొట్టంల వెట్టిండ్రు. జురుమాన పైసలు కార్యదర్శి దగ్గరున్నయి. నిన్నటి నుండి అగ్గయి మండుతండు.

"అందుకేగదా... మీకో మంచి సౌకర్యముంది. దీపం పథకంతో సిలిండరత్తది. పొయ్యి గూడా ఇస్తరు. పొగలేని పొయ్యి..." లేడీ వార్డు నెంబరు అంటుండగనే ఉపసర్పంచ్ అందుకున్నడు.

"మేమేం ముల్లెలు గట్టుకుంటమని మీ దగ్గర జురమాన తీసుకుంటలేము. మీ పైసలు మీకే గ్యాస్ కనెక్షన్‌కు కడుతం. సాంక్షన్ అయినంక ఎంతో కొంత నగతు గట్టి సిలిండర్ తెచ్చుకోవాలె. నిన్న రాజాలు దండుగు గట్టంగనే సర్పంచ్, నేను ఇద్దరం గ్యాస్ కంపెనీకి పోయి రాజాలు పేరు మీద కనెక్షన్ కట్టి వచ్చినం...." అందరివైపు గర్వంగా చూసి అన్నడు.

రాజాలు ఆవేశం చప్పున చల్లారిపోయింది. 'మహానుభావులు. మంచిపని చేసారు' అన్నట్టుగా నిలబడ్డాడు. మరో రెండు మూడు డైలాగులు కొడితే కరిగిపోయి కాళ్ళమీద పడేట్టుగా ఉన్నాడు. ఉపసర్పంచ్ మాటలు కూడా అలాగే ఉంటాయి.

'సమయానికి మంచి పాయింటు చెప్పినవు" కళ్ళతోనే మెచ్చుకున్నడు సర్పంచ్.

'మరేం చేసేది. జురుమాన గట్టినోళ్ళంతా

(మిగతా 23వ పేజీలో)

బలివాడ కాంతారావు గారి అముద్రిత నవలలు

పుంఖానుపుంఖలుగా కథలు, నవలలు రాసిన సీనియర్ రచయిత బలివాడ కాంతారావు గురించి పాఠకలోకానికి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఏ ఇజాలు, వాదాల జోలికి పోకుండా తన మానాన తాను అదే పనిగా రాసుకుంటూ పోయిన మహానుభావుడు ఆయన. అవార్డులు, సన్మానాలకతీతంగా తన ధోరణికి తాను కట్టుబడిన రచయిత బలివాడ కాంతారావు. బలివాడ కాంతారావుగారి సమగ్ర సాహిత్యాన్ని వెలువరిస్తున్న దశలో విశాలాంధ్ర వారు ఈసారి బలివాడ కాంతారావుగారి అముద్రిత నవలలు రెండింటిని "జన్మభూమి, అమ్మి" అనే పేరుతో వెలువరించడం మంచి ప్రయత్నమే.

"జన్మభూమి" నవలలో తండ్రి బోధనలు, తన అధ్యయనంలో విద్యాధికుడుగా ఎదిగిన లాయర్ ప్రభాత్‌కు ఎక్కడా మనశ్శాంతి దొరకదు. ప్రపంచం ఎందుకు ఇలా సంకుచితంగా మారిపోతుందో అతనికి అర్థం కాదు. మనం పాతికేళ్ళు పైగా స్వతంత్రులం. ఒక పరతంత్ర సంఘం నుంచి రూపొందిన ఈ స్వతంత్ర సంఘంలో వ్యక్తి ఎలా సంచరిస్తున్నాడు? దొరికిన స్వేచ్ఛ వలన నాగరికుల కూడలిగా వుండవలసిన ఈ సంఘం దిగజారుతుంటే దానికి కారణాలేమిటి? ఈ జాడ్యాలను మనం మామూలు మందులతో కుదర్చగలమా? లేకపోతే ఈ కుళ్ళిపోయిన సంఘానికి స్వస్తి చెప్పి, కొత్త సాంఘిక వ్యవస్థను స్థాపించడానికి కావలసిన విప్లవం రావడానికి తగ్గ పరిస్థితులు ఏర్పడి వున్నాయా?" ఇలా అంతులేని ఆలోచనలతో కొట్టుమిట్టాడుతుంటారు. చివరకు ప్రజల మధ్య తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారం కోసం ప్రయత్నించడానికి దేశాటన మొదలు పెడతాడు. ఎక్కడ ఏదైనా మంచి కానీ, చెడు కానీ జరిగినా దాని గురించి తెలుసుకొని తన ప్రతిస్పందనను నిష్కర్షగా తెలియజేసి ప్రజల ఆగ్రహానికి, అనుగ్రహానికి కూడా పాత్రుడవుతాడు. ప్రభాత్ స్వంతపూరు తిరిగి వచ్చాక తను కన్నదీ విన్నదీ కూడబలుక్కుని ఇదివరకు తను ఏ ప్రశ్నలు వేశాడు వాటిలో కొన్నిటికైనా సమాధానాలు దొరుకుతాయేమనని చూస్తాడు. తను చూసిన హృదయ విదారక దృశ్యాల కన్నా, తాను పొందిన అభిమానాలు తనను విడిచిపెట్టడం లేదు. ఆ వ్యక్తులూ, ఆ సంఘటనలూ తన మనసులో పాతుకుపోవడం వలన వాళ్ళింక దీపపు స్తంభాల్లా వెలుగుతున్నారు. ఉద్వేగం, ఉత్సాహం రెండూ మనసులో రెండు వాహినుల్లా ప్రవహించి కలవడం వలన ఆలోచించి ఎటువంటి సమాధానాలను పొందలేకపోతున్నారు. దేశమంతా తిరిగి ప్రజల సమస్యనే కాదు, పరిష్కార మార్గాలను కూడా వాళ్ళ ద్వారానే తెలుసుకోవాలి. కొన్నాళ్ళ విశ్రాంతి తర్వాత ద్విగుణీకృత ఉత్సాహంతో మళ్ళీ దేశాటనకు బయలుదేరుతాడు. చివరకు మార్పు తేవాలంటే పార్లమెంటరీ వ్యవస్థలోనే మంచివాళ్ళను ఎన్నుకొని కొత్త విప్లవం తీసుకురావాలన్న ఆశావహ దృక్పథంతో నవల ముగుస్తుంది. తనదైన సంస్కరణవాద దృక్పథంతో రచింపబడిన ఈ నవల ఒక డాక్యుమెంటరీలా తయారయింది.



బలివాడ కాంతారావు నవలలు
జన్మభూమి, అమ్మి
ముద్రణ, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు;
వెల : రు. 90

జీవితమంతా కష్టాలతోనే బ్రతికిన ఒక అభాగ్యురాలి కథే "అమ్మి". నిజానికి అమ్మి కథ, వాళ్ళ అమ్మ మాసాలమ్మ పుట్టుకతో మొదలై అమ్మి చనిపోయేంత వరకు దాదాపు మూడు తరాల జీవితాలను గ్రంథస్థం చేసింది. చిన్నప్పుడే తండ్రి మరణించడంతో అమ్మి కుటుంబం పరాయి పంచన బ్రతకాల్సి వస్తుంది. చివరకు వారి జీవితాలు కూడా అలాగే ముగుస్తాయి. అమ్మి బాల్యంలో కానీ, వివాహమైన తర్వాత మొగుడితో కానీ, వృద్ధాప్యంలో కానీ ఎక్కడా ఆమెకు సుఖపడే యోగం లేకపోతుంది. వంటలక్కలా ఇళ్ళు మారుతూ జీవితాన్ని వెళ్ళదీస్తూ చివరకు కళ్ళు మూస్తుంది. ఇది పేరుకు 'అమ్మి' కథ అయినా అమ్మి, మాసాలమ్మ ఎవరి ఇంట ఆశ్రయం పొందుతారో వారి కథలు, వారి బంధువులు - చుట్టు పక్కల వారి వివరాలను కూడా పొందికగా కథలా, డైరెక్టర్‌లా ఇవ్వడంలో రచయితకు వున్న నేర్పు, ఓపికకు జోహార్లు అర్పించవలసిందే. ఎంతకూ అంతుపట్టని టీవీ సీరియల్‌లా ఈ నవల రకరకాల మార్పులు, ట్విస్టులతో మన ఓపికను పరీక్షిస్తూ కొనసాగుతూనే వుంటుంది. సీరియస్‌గా చదివేవారు మాత్రమే ఈ నవలను ఓపికగా చదివి ఆనందించవచ్చు.

- కె.పి.అశోక్ కుమార్

స్వీకారం

ఆంధ్రమహోద్యమం

వెల : రు. 5/-; ప్రతులకు : ఇ.ఎల్.నారాయణ సొసైటీ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్, 2వ లైన్, పటేల్‌నగర్, బాపట్ల - 522101. గుంటూరు జిల్లా

నవజీవనం

రచన : డా॥ నాగినేని భాస్కరరావు, వెల : రు. 30/-; ప్రతులకు : యువభారతి కార్యాలయం, ఆంధ్రసారస్వత పరిషత్తు భవనములు, తిలక్ రోడ్, హైదరాబాద్

బుజ్జోని కల

రచన : వి. చంద్రశేఖర శాస్త్రి; వెల : రు. 30/-; ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; వేదాద్రి ఇందిరా శర్మ, అనంతపురం; స్పందన అనంత కవితా వేదిక, అనంతపురం;

ఏ కళలోనైనా రాణించాలంటే కృషి, పట్టుదలతోపాటు సృజనాత్మకతగల ఆలోచనలు కూడా ఆయారంగాల్లో ప్రత్యేకతను చేకూరుస్తాయి. వైవిధ్యమైన ప్రక్రియతో పాటల్ని పాడుతూ సరిలేరు మాకెవ్వరు అన్న చందాన లక్షలాది ప్రేక్షకుల్ని తమ ప్రతిభాపాటవాలతో మైమరిపిస్తున్నారు. వర్ధమాన గాయకులు ఎమ్.గురుస్వామి, ఎల్.వెంకటేశ్వర్లు. ఇటీవల ఒక గంటలో వంద పేరడీలు-వంద యుగళగీతాలు విడివిడిగా పాడి సరికొత్త రికార్డు సృష్టించిన ఈ అపురూప గాయక ద్వయం గురించి ఈ వారం తెలుసుకుందాం.

ఇద్దరూ... ఇద్దరే

పేరడీలతో గారడీలు చేసే గురుస్వామి

నిత్యసాధన అంతకు మించి పట్టుదల ఉంటే ఎలాంటి క్లిష్ట ప్రక్రియనైనా అవలీలగా సాధించి తీరవచ్చుననే దానికి పర్యాయపదంగా నిలుస్తారు గురుస్వామి. లలిత, జానపద గీతాల గాయకుడిగా, రచయితగా కళాజీవితాన్ని ప్రారంభించిన గురుస్వామి పాటలపై పట్టు ఏర్పడిన తర్వాత పేరడీల పాటల అల్లికపై దృష్టి సారించడం మొదలెట్టారు. అంతే ఆ ప్రవాహం నిత్య ప్రవాహ గోదావరిలా సాగుతునే ఉంది. ఏ పాటకైనా పేరడీగా మలిచి రచన చేయడం గురుస్వామికి నల్లేరుమీద నడిచినట్లే. పేరడీగా అల్లిన పాటలన్నీ సామాజిక సందేశాన్ని ప్రకటించేవే కావడం ఒక విశేషమయితే ఒర్జినల్ బాణీకి ఏమాత్రం తీసిపోని పంథాలో అదే శృతిలో పాటను పాడి సంగీతప్రియుల్ని గురుస్వామి ఆకట్టుకోవడం మరో విశేషం. ఒక పక్క వినోదాన్ని పంచుతూనే మరో ప్రక్క శ్రావ్యమైన తన గాత్రంతో ప్రేక్షకుల్ని అలరించడం గురుస్వామికే చెల్లునంటే అతిశయోక్తి కాదు. ఉద్యోగరీత్యా పోస్టల్ డిపార్డుమెంట్‌లో పనిచేస్తున్న గురుస్వామి సంబంధిత డిపార్టుమెంట్ తరపున జాతీయ స్థాయి పాటల పోటీలలో పాల్గొని అనేక సార్లు విజేతగా నిలిచారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా సుమారు మూడువేలకు పైగా ప్రదర్శనలు పూర్తి చేసిన గురుస్వామి ప్రయోగాల్ని చేయడంలో కూడా ముందే ఉంటారు. ఒకే ఒక్కడు సినిమాలోని 'నెల్లూరి నెరజాణ' పాటను 25 రకాలుగా విభిన్న ప్రక్రియలలో 'పైలా పచ్చీస్' పేరుతో పాడి జాతీయ రికార్డును సృష్టించారు. కర్నాటక శాస్త్రీయం, పద్యనాటకం, పంజాబీ ఫోక్, తోలుబొమ్మలాట, హిందూస్థానీ, గజల్, హరికథ, బుర్రకథ, ఒగ్గుకథ, వెస్ట్రన్, సుందరకాండ, భజన, విప్లవం, సుప్రభాతం, ఖవాలి, డాండియా, కర్నాటక జానపద, ర్యాప్ మ్యూజిక్, తత్వం, భిక్షాటన, లంబాడి, ముజ్రా, ముర్షా, పడవపాట, చెక్కభజన, మొదలైన ప్రక్రియలన్నీ ఒకే పాటలో చూపించడం గురుస్వామికే చెల్లింది. ఊయల కమ్యూనికేషన్ ద్వారా 1999 సంవత్సరంలో 'పేరడీ ప్రవీణ' బిరుదుతో సత్కరింపబడిన గురుస్వామి కేవలం వేదికలపైనే కాకుండా బుల్లితెరపైనా తన మనుగడ చాటుకుంటున్నారు. ఈటీవి, జెమినీ, మా తదితర ఛానల్స్ ద్వారా వందలాది అభిమానులను సొంతంచేసుకున్న గురుస్వామి గాయకుడిగా, రచయితగా, నటుడిగా ఇలా అనేక ప్రక్రియల్లో రాణిస్తూ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొంటున్నారు. గురుస్వామి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుందాం.

అభినవ ఎల్లారీశ్వరి ఎల్.వెంకటేశ్వర్లు

మరో విలక్షణ కళాకారిడిగా ప్రేక్షకుల ఆధారాభిమానాలను పొందుతూ స్వరమాంత్రికుడిగా సంగీతాభిమానుల కితాబునంటుకుందున్న ఎల్.వెంకటేశ్వర్లు అలనాటి గళాలను యధాతతంగా పలికించడంలో దిట్ట. కళ్లుమూసుకొనివింటే ఎల్.ఆర్.ఈశ్వరి, భానుమతి, వాణీజయరాం, ఎస్.జానకి, ఎమ్.ఆర్.తిలకం, లీల, జమునారాణి, శారద, ఉష, ఏ.ఎమ్.రాజా , ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, పి.బి.శ్రీనివాస్, జేసుదాసు, రాజాసీతారాం, ఇలా పలు వైవిధ్య స్వరాలను మనకు వినిపించే వెంకటేశ్వర్లు మగ, ఆడ గొంతులను ఏకకాలంలో పలికించి యుగళగీతాలాపన చేయగలడు. తెలుగు విశ్వవిద్యాలయంలో మిమిక్రీ కళలో నేరేళ్ళ వేణుమాధవ్ గురుశిక్షణలో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసిన 'ఎల్వీ' మిమిక్రీ కళను ఆధారంచేసుకొని 'మిమిక్రీ సింగింగ్' ప్రక్రియను సాధనతో తనకంటూ ప్రత్యేక ముద్రను ఏర్పరచుకున్నారు. 2001 సంవత్సరం ఊయల కమ్యూనికేషన్స్ సంస్థ ద్వారా 'అభినయ ఎల్లారీశ్వరి' బిరుదునందుకున్న ఎల్.వెంకటేశ్వర్లు ఇప్పటివరకూ 1000కి పైగా ప్రదర్శనలు పూర్తిచేసి ఎన్నో సత్కారాలు పొందారు. నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నారమ్)లో ఫొటోగ్రఫీ విభాగంలో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎల్.వెంకటేశ్వర్లు సంబంధిత అధికారుల ప్రోత్సాహం , అలాగే ఎప్పటికప్పుడు వినూత్న కార్యక్రమాలకు రూపకల్పన చేసే గురుతుల్యులు చొక్కామ వెంకటరమణ అండదండలు వెలకట్టలేనివని చెబుతుంటారు. మధుర గీతాల సృష్టికర్తల గళాలను యధాతతంగా పలికించే ఎల్.వెంకటేశ్వర్లు మరింతగా రాణించాలని కోరుకుందాం.



* రాకెట్ల వీరన్న

అనంతలో కొనసాగుతున్న మూఢాచారం

అక్కడ స్త్రీని చాలా హీనంగా చూస్తారు. వాడుకుని పారేసే వస్తువుతో సమానం. బిడ్డకు జన్మనిచ్చి వంశాన్ని నిలబెట్టినా జాలైనా చూపరు. ఆమె ఏనాడూ మల్లెపూలు పెట్టుకొని ఎరుగదు. ఒకవేళ పెట్టుకున్నా, పెట్టుకోనీదు వారి సంప్రదాయం. ఒక్కోసారి ఆమె కోసం వండిన వంటపాత్రలు ఇంట్లో వారి పాత్రలకు తగిలితే ఆ పాత్రల్లోని అన్నం, కూరలన్నీ బయట పడేసి కుటుంబ సభ్యులు మరలా చేసుకుని తింటారు. ఇదంతా స్త్రీని హింసించాలని చేయడం కాదు. అనాదిగా వస్తున్న వారి మూఢాచారం, సంప్రదాయం వారితో ఇలా చేయిస్తోంది.

ఇల్లాలు గర్భవతయితే భర్త ముఖంలో ఆనందం, కూతురు గర్భిణీ అయితే తల్లిదండ్రులలో సంతోషం చూస్తాము. ఇది సర్వ సాధారణం. దీంట్లో ప్రత్యేకత ఏముంది? ప్రతి చోటా జరిగేదే కదా! కానీ అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గంలోని రొళ్ల, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. స్త్రీ గర్భిణీ అయితే భర్తలోనూ, అత్తమామల్లోనూ, ఆమె తల్లిదండ్రుల్లోనూ దిగులు మొదలవుతుంది. మానవుడు చంద్ర మండలాన్ని చక్కర్లు కొట్టిన ఈ హైటెక్ యుగంలో కూడా అక్కడ పురాతన సంప్రదాయాల్ని పాటిస్తున్నారు. స్త్రీ బిడ్డకు జన్మనిచ్చి వంశం పేరు నిలబెడితే సంతోషించాల్సిన కుటుంబ సభ్యులు దాన్ని అరిష్టంగా భావించి ప్రసవానికి మూడు రోజుల ముందు నుండి మూడు నెలల వరకూ ఆ తల్లీబిడ్డలను ఊరి బయట ఆరు బయలులో (అడవిలో) 'గడ్డిపాక' వేసి అందులో ఉంచుతారు. ఆమెకు బియ్యం, పప్పులు, నీరు దూరం నుండి (తాకకుండా) అందించి వస్తారు. ఆ పసిగుడ్డును చూసుకుంటూ ఆ బాలింత స్వయంగా వంట వండుకుని తినాలి. నిర్మానుష్యమైన ఆ ప్రదేశంలో తేళ్లు, పాములు, తదితర క్రిమికీటకాదులు సంచరిస్తుంటాయి. వాటిమధ్య ఆ తల్లీపిల్ల మూడు నెలలు కాలం వెళ్లదీయాల్సిందే. 'నాతిచరామి' అంటూ పెళ్లి సమయంలో ప్రమాణం చేసిన భర్త కూడా ఆమెను సమీపించడు. కనీసం తొంగి చూడడంటే ఈ సంప్రదాయం ఎంత దారుణమైందో అర్థం చేసుకోవచ్చు. కొడుకో, కూతురో పుట్టిన వెంటనే ఉరుకులు పరుగులతో తండ్రి వస్తాడు. కానీ ఇక్కడ మూడు నెలలు దాటేదాకా కనీసం తొంగిచూడడంటే ఇంతకంటే దుర్మార్గం, దౌర్భాగ్యం మరొకటి ఉండదు. ఇంట్లో ప్రసవిస్తే తమ ఇంటికి అరిష్టం తగులుతుందని ఈ మూఢాచారాన్ని పాటిస్తున్నారు. మూడు నెలల తర్వాత వారిని ఇంటికి తెస్తూ ఆ పాకను కాల్చి వస్తారు. ఇదే

కాదండోయ్ అమ్మాయి పుష్పవతి అయినా, స్త్రీ, యువతి బయటచేరినా (పీరియడ్) ఇంట్లో నుంచి కొద్దిరోజులు గెంటివేయబడతారు. ఈ సంప్రదాయాలు 'కాడిగొల్ల', 'ఊరుగొల్ల' అనే కులాల్లో పాటిస్తున్నారు. 'కాడిగొల్ల'లు పూర్తిగాను, 'ఊరుగొల్ల'లు పాక్షికంగాను పాటిస్తున్నారు. కాడిగొల్లలు ఏకంగా అడవులకు పంపిస్తే, ఊరుగొల్లలు ఊర్లోనే తమ ఇంటిలో పశువుల పాకలో ఉంచి, ప్రత్యేకంగా ఒక ప్లేటు, చెంబు, గ్లాసు, చాప ఇస్తారు. ఆ మహిళలు (బాలింతలు, బహిష్టులు, పెద్దమనిషి అయిన వారు) ఎవర్నీ తాకరాదు. గుడ్డికంటే మెల్ల మేలు అన్నట్లు కాడిగొల్లలకంటే ఊరుగొల్ల కాస్త నయం. 'ప్రజాశక్తి' వీరిని కలిసిన సందర్భంగా ఈ ఆచారాన్ని ఎందుకు పాటిస్తున్నారని అడిగితే "ఇలా చేయకపోతే మా కులదేవతలు (ఎత్తప్పదేవుడు) మమ్ములను శిక్షిస్తారని" సమాధానమిస్తున్నారు. వీరి అలవాట్లు, ధోరణులే ప్రత్యేకంగా ఉంటాయి. అటవీ ప్రాంతంలో ఈ కులానికి చెందిన వారందరూ ప్రత్యేకంగా గుడిసెలు వేసుకొని నివసిస్తారు. కేవలం ఈ గొల్లలు మాత్రమే అక్కడుంటారు. వీరి కాలనీని "గొల్లహట్టి" అంటారు. గుడదహళ్లి హట్టి, హెచ్ఆర్‌సి హట్టి, గుంతకల్ గొల్లహట్టిలని వీరు నివసించే ప్రాంతాలున్నాయి. ఊరికి దూరంగా అడవీ ప్రాంతంలో నివసిస్తున్నందున వీరికి సరైన వైద్యం ఉండదు. ఆకు పసరులను ఎక్కువగా వాడతారు. ఈ కులస్తులలో చదువుకున్నవారు, ప్రజాప్రతినిధులు, లాయర్లు కూడా ఉన్నారు. ఆ సమయంలో వారి భార్యలకు కూడా ఈ ఇబ్బందులు తప్పవు సుమా. రొళ్ల జెడ్‌పిటిసిగా మహిళ ఉన్నారు. ఈమె కొడుకు లాయర్. పీరియడ్ సమయంలో జెడ్‌పిటిసి, లాయరు భార్య కూడా ఈ సంప్రదాయాలు పాటించడం గమనార్హం. ఇలాంటి సమయంలో వీళ్లకు ఇంట్లోవాళ్లు వంట వండుతారు. వండేటప్పుడు పొరపాటున వారి కోసం కేటాయించిన పాత్రలు ఇంట్లో వారికోసం వండుకున్న అన్నం పాత్రలకు తగిలితే ఖతం. ఆ అన్నం మొత్తం పడేస్తారు. మానవుడు గ్రహాలన్నీ చుట్టి వచ్చే మేధస్సును సంపాదించిన ఈ కాలంలో ఇంత దారుణమైన శిక్ష మహిళలకు విధించడం న్యాయమా? ఈ కులంలో స్త్రీలు కనీసం మల్లెపూలు కూడా పెట్టుకోరాదు. ఆభరణాలు సింగారించుకోరాదని ఏ శాస్త్రంలో చెప్పారు? ఎందుకిలా చేస్తున్నారని అడిగితే "అలా చేయకపోతే మా వంశం వృద్ధి కాదు. మాకు శాంతి ఉండదు. మంచి జరగదు. మా ఎత్తప్ప దేవుడు శిక్షిస్తాడని" గుంతకల్లు గొల్లహట్టికి చెందిన చిక్కమారప్ప, కెంద మారప్ప అంటారు. ఆ బాలింతలను అడిగితే " అనాదిగా వస్తుంది కదా సార్! పాటించకపోతే మా పెద్దలూరుకోరు. కాబట్టి పాటించకతప్పదు" అని అంటున్నారు ఈ పాకల్లో ఉన్న అమ్మాజక్క, మారెక్క, కెందమ్మ.



అమ్మాజక్క, మారెక్క కాన్పు అయిన సందర్భంగా ఊరు బయటే ఉంచిన దృశ్యం

యువతిగాని, స్త్రీగాని బహిష్టు (పీరియడ్) అయితే మూడు రోజులు లేదా ఐదు రోజులు బహిష్కరిస్తారు. అప్పుడు కూడా వారికి గొడ్లపాక, వామిదొడ్డిలో (పశువుల మేత వేసే ప్రదేశం) పాక తప్పదు. నిర్దేశించిన సమయం తర్వాత స్నానం చేసి ఇంట్లోకి రావాలి.

అమ్మాయి పుష్పవతి (పెద్దమనిషి) అయితే 15 రోజులపాటు ఊరి బయట 'గడ్డిపాక'లో ఉండాల్సిందే. ఈ అమ్మాయికి మాత్రం వంటావార్పూ ఇంట్లో వాళ్లు చేసుకునిపోయి ఇచ్చి వస్తారు. ఈ అమ్మాయికి మాత్రం ఒకరు రాత్రి వేళల్లో తోడుంటారు.



మారెక్క, కెందమ్మ బహిష్టు అయిన సందర్భంగా ఊరు బయట ఉంచిన దృశ్యం

15 రోజుల తర్వాత పేరంటం చేసి ఇంటికి తీసుకెళతారు.

ఇతరులెవరైనా పనుండి వీరి గొల్లహట్టిలోకి (కాలనీ) వస్తే దూరం నుండి గమనించి మన దగ్గరకు పరిగెత్తుకొచ్చి ఏం కావాలని అడిగి మాట్లాడించి అక్కడి నుండే పంపిస్తారు. ముఖ్యంగా ఎస్‌సిలనయితే అసలు ఆ కాలనీలలోకే రానివ్వరు. అలా ఎవరైనా వస్తే వచ్చినవారికీ, తమకు కూడా అరిష్టం కలుగుతుందంటారు. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ అధికారులను మాత్రం వారి ఇళ్ల దగ్గరకు రానిస్తున్నారు.

నిత్యం గొర్రెలు, పశువులను కాచుకునే వీరికి చదువు సంధ్యలు లేకనే ఈనాటికీ ఈ దురాచారాలను పాటిస్తున్నారనిపిస్తోంది. సంవత్సరంలో దాదాపు తొమ్మిది నెలలు వీరు ఆవులను కాచుకుంటూ వలసలో ఉంటారు.

ఇంటింటికీ చదువు, ప్రజల వద్దకు పాలన, వెలుగు, అక్షర సంక్రాంతి, మళ్లీ బడికి లాంటి తెలుగుదేశం ప్రభుత్వ పథకాలు ఏమయ్యాయి ? అవన్నీ వీరికి వర్తించవా? వర్తిస్తే ఇలా ఎందుకు ఉన్నారు అని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ●

గురిజ గింజలు

(19వ పేజీ తరువాయి)

ఎనుక నిలవడ్డరు. అందరొక్కటయితే అపుడు వశంగాదు.' ఉపసర్పంచ్ చూపులతోనే చెప్పిండు.

"ఔ... పటేలా... మరి మాసంగతేంది. మేము మొన్ననే జురుమాన గడితిమి..." మెత్త మెత్తగా అడిగిండు శంకరి.

"అందరికత్తయి. ఒగనాడు టాక్టరు గట్టుకుని పోతే అందరయి తేవచ్చు." కార్యదర్శి అందుకున్నడు.

ముంచుకొత్తున్న ప్రమాదాన్ని ముందుగా గుర్తించింది ఉప్పలయ్యనే. కొడవలి, గొడ్డలిని చేతులు మార్చుకుంటూ "వత్తయి వత్తయి" బుడ్లకు నూనె లేదుగనీ ఎడ్ల కొట్టంల దీపం బెట్టమంటరు. నెలనెలకు మూడు వందలు గట్టి గ్యాసు కొనుక్కునే దమ్ముంటే మా బతుకులు గిట్లెందుకుండు. అవసరం లేనిదాన్ని అవసరంగా తలుగవెట్టి ఆటలాడాలనుకుంటండ్రు. మాకు ఏ దీపాలొద్దు. మా బతుకు మమ్ములను బతుకనియ్యండ్రి" ఆవేశంగా అన్నాడు.

ఈసారి చౌకిదారు అందుకున్నడు బొంగురు గొంతుతో. "అవున్రా... మాకేమన్న పొయ్యిమంటన్నమా.. పెట్టుమంటన్నమా... గవుర్మెంటు కానూన్ జెప్తుతున్నం. అడువులు గొడితే ఎంత నష్టమో మీకు తెలువది. చెప్పితే ఇనరు. గుడ్డి ముసుర్లు వెట్టి బజార్లల్ల కప్పలు గుడ్లు వెట్టే కాలంల ఎండలు గొట్టి దుమ్ము లేత్తుంది. ఎందుకో తెలుసా....?"

"తెలువది సారూ... మాకు యాడ తెలుస్తది. కామారెడ్డిల మీ అల్లునుకి కట్టెకోత మిషనుంది. కొడుక్కు టింబర్ డిపో ఉంది. లారీలకు లారీలు కట్టెలు వత్తయి పోతయి. అక్కడ ఈ సూత్రం అడ్డం రాదా... మేము దెచ్చే బండెడు కట్టెలు మీ డిపోల రంపం పొట్టు విలువగాదు..." అన్నాడు ధిక్కరిస్తున్నట్టుగా ఉప్పలయ్య.

"దానికి లైసెన్సుంది. కాయిదాలు కథలు ఎన్నుంటయి. దానికి దీనికి పొత్తేంది...?" గాటుగానే అన్నాడు చౌకిదారు.

"లైసెన్సులుంటే వానలు గొడుతయా మరి..." కారడ్డంగా అడిగిండు ఉప్పలయ్య.

వెనుక ఉన్నాళ్ళంతా సప్పవడ్డరని తెలిసిపోతుంది. కావాలనే మాటలతో వాళ్ళకు ఆశను చూపారని గుర్తించిండు. తాను మాత్రం వినేది లేదని మొండి పట్టుదలతో ఉన్నడు.

ఈసారి చౌకీదారుకు ఏం జెప్పాలెనో తెలువలేదు. అందరు కుర్చీలల్ల ఇబ్బందిగా కదిలిండ్రు. ఎనుక నిలబడ్డోళ్ళు కొందరు నవ్విండ్రు. జురుమాన గట్టినోళ్ళు 'వీడు మనకు సిలిండర్లు రాకుంట జేత్తండు' అని కోపంగా చూసిండ్రు.

ఈసారి కార్యదర్శి అందుకున్నడు. "ఎవలంటే వాళ్ళమీదికి ఉరుకుతున్నవు. పెద్దా చిన్న లేకుంట నోటికచ్చినట్టు మాట్లాడుతున్నవు. అసలు నువ్వు ఏమనుకుంటున్నవు. మేమంతా నీకు పిచ్చోళ్ల లెక్కన కనవడుతున్నామా..?"

కట్టెలతో చుట్టూ మంది నిలబడి నట్ల నడుమున నాగంబాము ఉంటే ఎటువైపు కట్టెతో తాకితే అటువైపు బుస్సున ఎట్లా లేస్తదో అట్లా లేస్తుండు ఉప్పలయ్య.

"కాదు సారు... మేమే మీకు పిచ్చోళ్ల లెక్కన కనవడతున్నం. అందుకే గదా మా మనుషులతోనే కట్టెలు గొట్టిచ్చి దొంగ కట్టెల యాపారం జేసిండ్రు. ఒక్క యాడాదిలనే మీ ఇంట్ల తీరొక్క కట్టె సామాన్లు చేయించుకున్నరు. మీనుట్టేడు బలుగాలకు చేయించిండ్రు... ఈ ముచ్చట కాదంటారా....?"

సర్పంచ్‌కు కోపం వచ్చినట్టుంది విసురుగా అన్నాడు.

"గవన్నీ గాదు.. ముందు నీ సంగతి జెప్పు. బండి ఇడుత్తవా...? జురుమాను గడుతవా...?

"నేనా...?" ముల్లు గట్టెను నేలపై పొడుస్తూ అన్నాడు ఉప్పలయ్య... బండి ఇడువ. జురుమానగట్ట. మీ ఇష్టమున్న పని జేసుకొండి. నేను మాత్రం కట్టెలు తెచ్చుడు తెచ్చుడే. మాపటికి పొయ్యిలకు పుల్లలేదు."

"అంటే... మా ఇష్టమున్న పని జేసుకొమ్మంటవు. ఎనుకశీరి ఏమనవుగద మరి!...." అక్కసుగా అడిగిండు సర్పంచ్.

"అనేదేముంది పటేలా అడవితో మీ అవసరాలు తీరినయి. అందుకని తైబందంటున్నరు. అడివికి పోవద్దంటున్నరు. దండుగంటున్నరు. జురుమానంటున్నరు. మీ లెక్కన మాకు ఎల్లుతదా... మా బదుకుడే ఓ సావు. అడుగడుగున సత్తుంటెనే బతుకుతం. ఇగనువ్వు కొత్తగ జేసేదేముంది. మాంటె కేసు పెడతవు. పోలీసులతో కొట్టిత్తవు. అంతేగదా. అట్ల నెలరోజులు అవస్త పడ్డా మళ్లా కోలుకుంట. ఈ కట్టెలు లేకపోతే రెండ్రోజులల్లనే ఆకలి మంటకు సత్తగద."

ఒక్కొక్కమాట ముల్లుతో ముల్లు దీసినట్టున్నయి. ఎవలు నోరెత్తుతలేదు. ఎత్తుతే యాడ ఏమంటడోనన్న భయం.

"నిన్ను ఎవలు సావుమంటుండ్రురా... మూడు వెయిలిచ్చినా దొరుకని గ్యాస్ కనెక్షన్ సగం ధరకే ఇప్పిస్తమంటున్నం..." ఉపసర్పంచ్ మళ్ళీ అన్నాడు.

'అంటరంటరు. అది మీ బామ్మరిది గోడౌన్ గదా! ఒక్క కనెక్షన్‌కు ఎంత లాభముంటదో తెలువదునుకుంటున్నావా... ఎట్లవెట్టు... మీరు మీ కిందికే తోడుకుంటరు. పెద్దమనుషులు గదా! అప్పుడప్పుడు ఇట్లా కొత్త కానూన్‌లు దీత్తరు. వల విసురుతరు. అండ్ల చిక్కుకుని మేము గిలగిల కొట్టుక చస్తం. ఈసారి మీ ఆటలు సాగయి..." వెనుకకు మళ్ళిండు ఉప్పలయ్య ఆవేశంగా.

గ్రామ పంచాది ఆఫీసు కడుప దాటిండో లేదో నీల ఎదురంగ వచ్చింది. ఆమె ఎంబడి సుంకరోళ్ళున్నరు. ఒక్కక్షణం ఆగి "ఏంటిదే.. ఎగపోనుకుంట ఉరికత్తున్నవు.. నన్ను సంపుతరనుకున్నవా...? పో... పో.. ఇంటిమొఖానపో..." అంటూ బండి దగ్గరికి నడిచిండు.

నీల అంతడి వెంటనే నడిచింది. "మనకు కట్టెలద్దు మన్నద్దు. ఊరుతో మనకెందుకు కంటు. నిన్ను ముందు ఊకిండ్రు. ఎనుకుండి ఎవలన్న ఏమన్న అంటండ్రా... జురుమాన కట్టినోళ్ళు గూడా నీదే తప్పంటండ్రు.. మన పొయ్యిల మందం ఏ అయ్యకన్న దయస్తది. ఎవలన్న ఇస్తరు. ఇంటికి నడువు." అన్నది.

ఎనుకకు తిరిగి నీలను ఇరుగ జాసిండ్రు ఉప్పలయ్య. ఆఫీసు నుండి అప్పుడే పెద్దలంత బయటకచ్చిండ్రు. అదంతా తమకు తెలుసన్నట్టు చూసి చూడనట్టుగనే దాటిపోతండ్రు. పోతూ పోతూ సుంకరోళ్ల దిక్కు చూసి ముసిముసి నవ్వుకుంట పోతండ్రు. సుంకరోళ్లు గూడా గుంభనంగా నవ్వుతూ నీలను ఉప్పలయ్యను చూస్తండ్రు.

చుట్టూ గుమిగూడిన జనం తలా ఒకటి మాట్లాడుతున్నరు. కొందరు ఉప్పలయ్యను మెచ్చుకుంటే, కొందరు, ఇంత కావురమా అని దుయ్యవడుతండ్రు. ఇదేమీ పట్టించుకోని ఉప్పలయ్య బండి ఎత్తికట్టిండు. నీల ఎక్కి కూసుంది.

ఇంటిముందుకు పోయినంక బండిని ఆపింది నీల.

"సుంకరోళ్లు జెప్పిండ్రు... మనను చూసి ఊరంతా బండిగడుతరట. అట్లా ఊరు అదుపు దప్పి పోతదట. చీకటి పడినంక ఎవలకూ తెలువకుంట జంగల్‌కుపోయి ఒకటిగాదు రెండు బండ్లు తెచ్చుకొమ్మన్నరు. మనకు కట్టెలు ముఖ్యం. అంతేగదా!" సముదాయించింది.

ఉప్పలయ్య వినలేదు. నీలగూడా వినలేదు. అడుగు ముందుకు కదులనియ్యలేదు. ఏడ్చింది. మొత్తుకుంది. ఉప్పలయ్య బండి ఇడువక తప్పలేదు.

అర్ధరాత్రిపూట నీలనే లేపింది ఉప్పలయ్యను. బండి బయలెల్లింది. ●

చిన్న వాక్యం

"సూర్యోదయాన్నే దర్శనం. శుభోదయం... రా.. రా..' ఆహ్వానించాడు సుబ్రహ్మణ్యం.

"శుభోదయం కాదు.. సుబ్బూ.. 'ఆది' ఉదయం.. అందుకే నా దర్శనం" బదులిచ్చాడు కైలాసం నవ్వుతూ. సుబ్రహ్మణ్యమూ నవ్వేశాడు.

"వాక్యంలో ఊతపదాలుండ కూడదని చెప్పావు.. సారీ రాశావు.. వాక్యాలు సరళంగా, సూటిగా అర్థం కావాలంటే ఏం చేయాలి?" ప్రశ్నించాడు సుబ్బు.

"మొదలుపెట్టావా! సరే ఊహించాను కానీ, మిగతా ప్రశ్నలు కూడా సంధించు మరి.. ఒకేసారి మాట్లాడతా. లేదా నేను రాసింది ఇస్తాను"

"ఓహోc రాసేశావా? గుడ్. అయినా ఈ అంశాలు కూడా అందులో వచ్చేలా చూడాలి"

"ఏమిటవి?"

"వాక్యాలు స్పష్టంగా ఉంటాయి, కానీ కొన్ని శబ్ద దోషాలు వాక్యాలను సరిగ్గా అర్థం కానీయవు. ముఖ్యంగా థర్డ్ పర్సన్‌లో రిపోర్టు చేసే వాక్యాలు. అంటే ప్రధానంగా పత్రికల్లో వచ్చే ఉపన్యాసాలు లాంటివి."

"ఇంకా?"

"ఇంకా ఏమిటోయ్.. మొదలెట్టు"

చిన్న కాగితాల పొత్తిని ఇచ్చాడు కైలాసం.

"ఏమిటి? వ్యాసం కాదు గదా!"

"కాదు. పాయింట్లే చదువు."

* * *

ఏ విషయాన్నయినా చెప్పడానికి భాష అవసరం. భాషకు మూలం వాక్యమే. విషయాన్ని ఎదుటి వ్యక్తిలోకి పంపడానికి వాహికే వాక్యం. వాహిక సమర్థవంతంగా ఉండాలి. అప్పుడే విషయం స్పష్టంగా వెళుతుంది.

వాక్య రచనలో కొన్ని సూత్రాలను పాటిస్తే సరైన వాహికను వాడినట్లు.

చిన్న వాక్యాలను రాయాలి. పొడవు వాక్యాలు అయితే ఏమి? అనే సందేహం రావచ్చు. అవి ఒక పట్టాన అర్థం కావు. నోరు తిరగవు. చదవడానికి ఊపిరాడదు. వాక్యం పొడవైనపుడు రాసే వ్యక్తీ గందరగోళంలో పడి వ్యాకరణ దోషాలు వచ్చే ప్రమాదముంది. అప్పుడు ప్రాథమికంగానే దెబ్బ తగులుతుంది. అంటే విషయం తప్పుగా అర్థమవుతుంది. ఉదాహరణకు ఒక వాక్యం..

'కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లోపభూయిష్ట పాలన మూలంగా రాష్ట్రంలో పేదరికం, నిరక్షరాస్యత, శాంతిభద్రతల సమస్య తలెత్తిందని, తాజాగా సిఎంపై దాడే అందుకు నిదర్శనమని అన్నారు !'

ఈ వాక్యంలో ఏం చెప్పదలుచుకున్నారో అర్థమవుతోంది. కానీ వెంటనే అర్థమవుతోందా? సులువుగా అర్థమవుతోందా? స్పష్టంగా అర్థమవుతోందా? అని ప్రశ్నిస్తే తడుముకోవాల్సిందే. పొడవు వాక్యాలను కూడా కొందరు సవ్యంగానే రాయగలరు. కానీ, చదివే పాఠకుడికి అది ఇబ్బంది. తెలుగులో చిన్న వాక్యాలదే సొగసు. మనం మాట్లాడేప్పుడు కూడా గుక్క తిప్పుకోకుండా మాట్లాడం. చిన్న వాక్యాలతోనే మాట్లాడతాము. కాబట్టి చిన్న వాక్యాలనే రాయాలి. మరో విషయం. పదాల అమరిక సరైన క్రమంలో ఉండాలి. అంటే పదబంధం. అది సరిగ్గా లేకపోతే విషయం ఏమిటోగా ఉంటుంది. సరిగ్గా చెప్పాలంటే డబ్బింగ్ సినిమాలో డైలాగులులాగా.

ఉదాహరణకు 'సినిమాకు నేను వెళ్లాను' అనే వాక్యం ఎలాగుంది? చిన్న వాక్యమేగానీ అంత బాగోలేదు. మనం ఇలా మాట్లాడం. 'నేను సినిమాకి వెళ్లాను' అంటాం. చూశారా! పదాల అమరిక మారగానే వాక్యం సుబోధకంగా ఉంది కదూ!

అలాగే, విషయ క్రమాన్ననుసరించి వాక్యాలుండాలి. అంటే ఒక క్రమంలో విషయాన్ని చెప్పాలి. వాక్యాలు ఆ పద్ధతిలో ఉండాలి.

మరో విధమైన తప్పులు రాతలో జరుగుతున్నాయి. 'సదస్సులో వెంకటేశ్వర్లు ప్రసంగించారని, తర్వాత ప్రారంభించినట్లు ఆయన చెప్పారు.' ప్రసంగించిన పదంలో 'అని', ప్రారంభించిన పదంలో 'అట్లు' జత కూర్చారు. రెండుచోట్లా రెంటిలో ఏదో ఒకటే జత కూర్చి చదవండి. వాక్యం ఎంత బాగుంటుందో!

అలాగే '...ప్రారంభించారని, తర్వాత ప్రసంగించారన్నారు' ఈ వాక్యం రెండో భావంలో రెండు క్రియల మధ్య సంధి (ప్రసంగించారన్నారు) జరిపారు. సంయుక్త వాక్యాల్లో రెండో భావానికి సంధి బాగోదు. 'ప్రారంభించారని, ప్రసంగించారని అన్నారు' (ప్రసంగించారు, అని) విడివిడిగా రాసుకోవాలి. అప్పుడు శబ్దం కూడా సాఫీగా ఉంటుంది. ఇలాంటి చిన్న జాగ్రత్తల వల్ల వాక్యం సుబోధకంగా ఉంటుంది. మరో విషయం. వాక్యంలో ఉపయోగించే పదాలు సరళంగా ఉండాలి. వాడుక పదాలై వుంటే మరీ మంచిది. ●

పాఠక స్పందన

ఆలోచింప చేసిన కవర్ స్టోరీ

అక్టోబర్ 12వ తేదీ ఆదివారం అనుబంధం కవర్ స్టోరీ 'విధ్వంసం సృష్టిస్తున్న మందుపాతర' ఆలోచింప చేసేదిగా ఉంది. మన రాష్ట్రంలో ఇటీవలి కాలంలో నక్సలైట్లు తమ టార్గెట్‌లో వున్న నాయకులను హతమార్చడానికి క్లైమోర్ మైన్స్ ఉపయోగిస్తూ తీవ్ర విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. ఇది సరైన చర్య కాదు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు. నక్సలైట్లు ఈ హింసాయుత మార్గానికి స్వస్తి పలికి, ప్రభుత్వంలో లొసుగులుంటే వాటిని ఎత్తి చూపుతూ ప్రభుత్వం మంచి పద్ధతిలో పయనించేటట్లు చూడాలి. అంతే తప్ప ఏ ఒక్కరినో హతమార్చినంత మాత్రాన వ్యవస్థ మారుతుందా?

- బట్టా రామకృష్ణ, సౌత్‌మోపూరు గ్రామం, నెల్లూరుజిల్లా

'రాజీ'నామాలు సహజంగా వుంది

సెప్టెంబర్ 28వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన ఎడిటోరియల్ 'రాజీ'నామాలు చాలా సహజంగా వుంది. నేటి రాజకీయాలు మాత్రం ఎవ్వరేమనుకున్నా నాకేటి సిగ్గు అన్న చందంగా వున్నాయి. ఇక కార్టూన్ కదంబంలో అద్వానీ, మాయ, కృష్ణయాదవ్, చంద్రన్నలను చూసి అయ్యోపాపం అని నవ్వుకొన్నాం. 'యువతను నిర్వీర్యం చేస్తున్న పాశ్చాత్య విష సంస్కృతి గురించి రాసిన కవర్‌స్టోరీలో హైటెక్ హైదరాబాద్‌లోని కొన్ని కోణాల్ని ఎక్సరే తీసి కళ్ళకు కట్టినట్లు చూపించినందుకు ధన్యవాదాలు. 'మనిషికోసం' గేయం చాలా బాగుంది. కథ ఎంతో స్ఫూర్తి దాయకంగా వుంది.

- పి.నూకరాజు, అనకాపల్లి.

సాహిత్యానికి స్థానం కల్పించాలి

అక్టోబర్ 5వ ఆదివారం అనుబంధంలో కవితలతో పాటుగా సాహిత్యం వ్యాసం ఒకదానికి కొంతస్థానం కల్పిస్తే సముచితంగా వుంటుంది. త్యాగమూర్తులైన వివిధ రాజకీయ పక్షాల నాయకుల జీవిత చిత్రణలను సంక్షిప్తంగా అందించే ప్రయత్నం చేస్తే బాగుంటుంది.

- సువారపు రామచంద్రరావు, తిరువూరు, కృష్ణాజిల్లా

అద్భుతాలు శీర్షిక పునరుద్ధరించాలి

ఆదివారం పుస్తకం చాలా బాగుంటోంది. పూర్వం ఆదివారం అనుబంధం చివరి పేజీలో అద్భుతాలు శీర్షిక వచ్చేది. దానిని తిరిగి పునరుద్ధరించగలరు.

- కె.రాహుల్ సాంకృత్యాయన్, పాలకొల్లు, ప.గో.జిల్లా

ఉన్ని అప్పమ్

కావలసిన వస్తువులు: బియ్యం - 180 గ్రాములు, రాగులు - 80 గ్రాములు, పచ్చికొబ్బరి తురుము - 50 గ్రాములు, బెల్లం - 300 గ్రాములు, ఏలకులు - 4 లేక 5, కూర అరటికాయ - ఒకటి, నెయ్యి - ఒక టేబుల్ స్పూన్, నూనె - రెండు టేబుల్ స్పూన్లు,

చేసే పద్ధతి : బియ్యాన్ని రెండుమూడు గంటలు నానబెట్టాలి. వాటిని కడిగి ఎండబెట్టి పిండి పట్టించాలి.

రాగులను మొలకలెత్తించి దోరగా వేయించి పిండి చేయాలి.

అరటి కాయ ఉడికించి మెత్తగా చేయాలి. బెల్లాన్ని కరిగించి అందులో మెత్తగా చేసిన అరటికాయ, కొబ్బరి కోరు, యాలకుల పొడిని బియ్యం, రాగి పిండిని కొంచెం జారుగా ఉండేలా కలుపుకోవాలి.

గుంటపునుగులు చేసే పాత్రలో కొంచెం నూనె వేసి వేడెక్కిన తరువాత ఒక్కో గుంటలో ఓ గరిటెడు పిండి వేసి దోరగా వచ్చేలా కాల్చాలి. వాటిని వడ్డించే ముందు కావాలంటే నెయ్యి వెయ్యవచ్చు.

రెండు ఉన్ని అప్పాలు తింటే 219 కిలో క్యాలరీల శక్తి లభిస్తుంది. ఇందులో 1.83 గ్రాముల ప్రొటీన్లు, 43.73 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 4.03 గ్రాముల కొవ్వు పదార్థం ఉంటుంది.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్థసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది